నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
బుధవారం | 28 ఆగస్టు 2024 | www.navatelangana.com

వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలి



- సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి

నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీవోఏలకు కనీస వేతనం రూ.26వేల అందించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని వీవోఏలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ముట్టడికి అందరూ సకాలంలో హాజరై జయప్రదం చేయాలని తెలిపారు. వీవోఏలు పని భారం తగ్గించి రాజకీయ వత్తులను ఆపాలని అన్నారు. గ్రీటింగ్ పద్ధతిని రద్దుచేసి ప్రతి నెల వీవోఏల సొంత ఖాతాలో డబ్బులు జమ చేయాలని అన్నారు. వీవోఏ ల సమస్యలను పరిష్కారం చేయాలని ఎన్నిసార్లు నివేదికలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని మండిపడ్డారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఎంతగానో దోదపడుతున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. వీవోఏల 58 జీవోను సవరించి వారికి మూడు నెలల రెన్యువల్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు

83.4 కేజీల ఎండు గంజాయి పట్టివేత



నవతెలంగాణ-మునిపల్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తుని నుంచి మహారాష్ట్ర నాసిక్‌కు అక్రమంగా తరలిస్తున్న 83.4 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. దాని విలువ రూ.30లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన అశ్రఫ్ అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ తుని నుంచి మహారాష్ట్ర నాసిక్‌కు టాటా సఫారీలో అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తుండగా.. పక్క సమాచారంతో ఎక్సైజ్ అధికారులు మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఆ వాహనం అడుగు భాగంలో గదులు ఏర్పాటు చేసి అందులో తీసుకెళ్ళుతున్న 83.4 కేజీల ఎండు గంజాయిని అధికారులు గుర్తించారు. దీంతో పట్టుబడిన గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ గాంధీ నాయక్, హెడ్ కానిస్టేబుల్ అలీం తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి



- పూణే ఆర్మీ ఆసుపత్రిలో మృతి
- నేడు గజ్వేల్ మండలం రిమ్మన గూడకు చేరుకున్న భౌతికఖాయం

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గుండారం శ్రీనివాస్ పూణేలో మృతి చెందాడు. మంగళవారం పూణేలోని ఆర్మీ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గుండారం శ్రీనివాస్(36) గత పదేళ్ల క్రితం ఆర్మీ ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. బార్డర్లో దేశ రక్షణ కోసం గడ్డకట్టిన మంచులో సైనికుడై సేవలందించాడు. దేశ ప్రజల సుఖ సంతోషాలే తన సంతోషంగా భావించి పదేళ్లు దేశానికి సేవ చేశాడు. అలాంటి వ్యక్తి గత రెండు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు.అక్కడే ఉన్న ఆర్మీ ఆస్పత్రిలో రెండు నెలలుగా చికిత్స తీసుకుంటున్నాడు. పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. అనంతరం పూణే ఆర్మీ జవాన్లు ఆయన చేసిన సేవలను సమర్థిస్తూ అధికారిక లాంచనాలు పూర్తిచేసి మృతదేహాన్ని ఆయనకు సంబంధించిన వస్తువులను భార్యకు అందజేశారు. ఇదిలా ఉండగా పూణే నుంచి మృతదేహాన్ని తన స్వస్థలం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చేరుకునేందుకు పూణే ఆర్మీ పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం తెల్లవారుజామున భౌతిక కాయం స్వగ్రామానికి చేరుకొనుంది. అనంతరం దహన సంస్కరణ పూర్తికానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్క దాడి

- తీవ్రంగా గాయాలు
- పదేళ్లుగా కుటుంబానికి దూరంగా దుర్భర జీవితం
- కొడుకున్నా చూడని వైనం..
- అన్న పానీయాలకు నోచుకోని దుస్థితి



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకలో దారుణం జరిగింది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిపై వీధి కుక్క దాడి చేసి ఆమె ముఖం, చేతులపై తీవ్రంగా గాయపరిచిన ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఒకటో వార్డు పరిధిలోని రేపల్లెవాడ లో సోమవారం రాత్రి జరిగింది. కన్న కొడుకు ఉన్నా.. తల్లిని చేరదీయకపోవడంతో స్థానికులే ఓ ప్రైవేటు స్థలంలో తలా కొంత చందాలు వేసుకుని ఓ పూరి గుడిసెను నిర్మించి ఆ వృద్ధ మహిళకు ఆశ్రయం కల్పించారు. భిక్షాటన చేస్తూ బ్రతికేది. ఈ క్రమంలో గత మూడేళ్లుగా ఆరోగ్యం సహకరించకపోవడంతో పూరి గుడిసెలోనే ఉంటున్న ఆ వృద్ధురాలికి అన్న పానీయాలకు నోచుకోని దుస్థితి తలెత్తడంతో చుట్టుపక్కల వారే సమకూరుస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన అయ్యవారి రంగవ్వ (90) భర్త కిష్టయ్య గతంలోనే చనిపోయాడు. ఆమె కుమారుడు సత్యనారాయణ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో భార్య పిల్లలతో నివసిస్తూ మిర్చి బండిని నిర్వహిస్తున్నాడు. గత పదేళ్ల కిందట కొడుకు సత్యనారాయణతో రంగవ్వకు విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో కొడుకుకు దూరంగా పట్టణంలోని రేపల్లె వాడలో రంగవ్వ కొంతకాలంగా వేరుగా కిరాయికి ఉంటుంది.వయసు మీద పడడం ,శరీరం సహకరించకపోవడంతో అదే కాలనీలో ఒకరి ప్రైవేట్ స్థలంలో కాలనీవాసులు రంగవ్వకు గుడిసెను నిర్మించి ఇచ్చారు.అందులోనే ఉంటూ దుర్భర స్థితిలో జీవనం వెల్లదీస్తున్న రంగవ్వ పై సోమవారం రాత్రి ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.ఆమె అరుపులు విన్న స్థానికులు కుక్కను తరిమేసి మంగళవారం ఉదయం 108, పోలీసు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కొడుకు సత్యనారాయణకు ఈ విషయం చెప్పినా పట్టించుకోలేదు.రంగవ్వను దుబ్బాక లోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ఆ తర్వాత రంగవ్వను కుమారుడు సత్యనారాయణ తాను ఉంటున్న డబుల్ బెడ్ రూమ్ ఇంటిలోకి తీసుకెళ్లాడు. ఈ ఘటనపై పట్టణవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెండేయ మార్గంలో ముందుకు సాగాలి

- తొగుటలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట





భక్తికి ముక్తికి ముందు వరుసలో నిలిచే భక్త మార్కెండేయ మార్గంలో అందరు ముందుకు సాగాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తొగుటలో జరుగుతున్న మార్కెండేయ దేవాలయంలో ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజీ ప్రపంచంలో దైవభక్తితో ప్రశాంతంత చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షులు లక్ష్మినారాయణ, మాజీ ఎంపీటీసీ సుతారి లలిత రమేష్, వేల్పుల స్వామి బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చిలి వేరి మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దోమల కొమురయ్య, నాయకులు మంగ నర్సింలు, కంది రాంరెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

దేవాలయాల్లో దొంగతనం చేస్తున్న వ్యక్తులు అరెస్ట్

- నిందితుల నుంచి 7.5 తులాల బంగారం
- 182 తులాల వెండి వస్తువుల రికవరీ.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

గ్రామాలలోని దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడుతూ బంగారు వెండి వస్తువులను ఎత్తుకెళ్తున్న దొంగలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. మంగళవారం ఏసీపీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జిల్లాలో గ్రామ దేవతల దేవాలయాల్లో తరచుగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో దొంగలు పట్టుకోవాలనే ఉద్దేశంతో తన ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాల్ పేట ఎస్సై ఆసిఫ్ తదితరులతో కలిసి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం చిన్నకోడూరు మండలం రాముని పట్ల శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన భోదాసు యాదగిరి, సిద్దిపేట పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన వల్లేపు శేఖర్ లు స్పెండర్ బైక్ పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించగా, పలు గ్రామాల్లో ఊరు బయట ఉన్న దేవాలయాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. జిల్లా లోని చిన్నకోడూరు, త్రీ టౌన్, టూ టౌన్, రాజగోపాల్ పేట, దుబ్బాక, కోహెడ, మద్దూరు, చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 20 దేవలయాల్లో దొంగతనాలు చేసినట్లు తెలిపారని, నిందితుల నుంచి వెండి కిరీటం, వెండి శ్రీ చక్రం, 5.5 తులాల పుస్తె మట్టెలు, 20 తులాల వెండి పట్టు కిరీటంలతోపాటు రెండు బైకులను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపినట్లు, మరో నిందితుడు కొమిరె శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు అధికారులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఏడుగురు అరెస్ట్, 17వేల నగదు ,10 మోటార్ బైకులు స్వాధీనం.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిష్ట సాగర్ గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి నిందితులను అరెస్టు చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులతో కలిసి వెళ్లి రైడ్ చేయగా పేకాట ఆడుతున్న 11 మందిలో నలుగురు వ్యక్తులు పారిపోగా, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి రూ.17,720 లతో పాటు, పది బైకులు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


డెంగ్యూ ఫీవర్....



విజృంభిస్తున్న విష జ్వరాలు

- వైద్యశాఖ మంత్రి ఇలాఖాలోనే పెరుగుతున్న కేసులు
- జిల్లాలో అధికారికంగా ఇప్పటికే 187 కేసులు.. అనధికారంగా మరిన్ని
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కలెక్టర్‌తో సహా ఆకస్మిక తనిఖీల్లో నిమగ్నం

నవతెంగాణ-జహీరాబాద్



జిలాలను డెంగ్యూ ఫీవర్ పట్టేసింది. ప్రతీరోజు ఒకటి రెండు కేసులు నమోదు అవుతుండడంతో.. ప్రజల్లో భయాందోళన మొదలైంది. గత కొన్ని రోజులుగా రోజుకో చోట మోస్తారు వర్షం కురుస్తుండడం.. వాతావరణం చల్లగానే ఉంటుండడంతో కేసులు సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వర్షపు నీరు రోడ్లపైనే నిలవడం.. గ్రామాల్లో సరైన పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఇలాఖాలోనే కేసులు సంఖ్య విపరీతంగా పెరుగుతుండడం గమనార్హం.

సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వ వైద్యశాలల్లో 187 డెంగ్యూ కెసులు నమోదయ్యాయి. అత్యధికంగా పటాన్‌చెరు 54, జోగిపేటలో 41, నారాయణ ఖేడ్‌లో 4, మొత్తం పీహెచ్‌సీల్లో కలిపి 187 కేసులు నమోదైనట్టు సమాచారం. ప్రయివేటు వైద్యశాలల్లో నయోదైన కేసులు అదనంగా ఉన్నాయి. అయితే ఒక్కసారిగా డెంగ్యూ కేసులు పెరుగుతుండడంతో.. ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కానీ సర్కారు ఆసుపత్రుల్లో మాత్రం అందుకు తగినట్టుగా ఏర్పాటు చేయలేదని.. దాంతో మళ్లీ ప్రయివేటు ఆసుపత్రులే దిక్కు అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా డెంగ్యూ వ్యాపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాస్త ఒళ్లు వెచ్చబడితే చాలు.. బెంబేలెత్తిపోతున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై నమ్మకం కుదరక రాజధానిలోని పెద్దాసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులు వైద్యం కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంటున్నది. కాగా పారిశుద్ధ్యం సరిగ్గా లేకపోవడంతో.. ప్రమాదకర దోమల తీవ్రత పెరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమలు కుట్టిన చోట ఎర్రటి దద్దుర్లు వస్తున్నాయని, దురద పుడుతోందని, వాటిని ఏ కొద్దిగా గోటితో గీరినా రక్తం వస్తున్నదని చెబుతున్నారు. ఈ లక్షణాలు ఉండడం వల్లనే డెంగ్యూగా అనుమానించాల్సి వస్తోందని చెప్పుకొస్తున్నారు. మురుగునీటి కాలువలు, పారిశుధ్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్లనే దోమల తీవ్రత పెరిగిందని మండిపడుతున్నారు. కాగా ఈ విషజ్వరాల పట్ల నిర్లక్ష్యంగా చేయకుండా.. సకాలంలో చికిత్స చేయించుకుంటే తగ్గిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందొద్దని.. అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని చెబుతున్నారు.

జన్యుపరమైన మార్పులతో పెరిగిన డెంగ్యూ తీవ్రత..

103 డిగ్రీల జ్వరంతో పాటు ఒళ్లునొప్పులు ఉంటాయి. అయితే ప్రస్తుతం వస్తున్న డెంగ్యూ కేసుల్లో చాలా మందికి ఈ లక్షణం కనిపించడం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజురోజుకు డెంగ్యూ తీవ్రత పెరగడానికి వైరస్‌లో జన్యుపరమైన మార్పులే కారణం కావచ్చుననే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లల్లో డెంగ్యూ చాలా తీవ్రంగా ఉంటుందని, ఎంత చిన్న పిల్లలైతే సమస్య అంత ఎక్కువ అని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా చక్కగా, పుష్టిగా ఉండే పిల్లల్లో డెంగ్యూ మరింత తీవ్రంగా ఉంటుందన్నారు. పిల్లలో కడుపు నొప్పి, వాంతులు, చికాకు, ఏడుపు, ఒళ్లంతా చల్లడబటం, నాడీ బలహీనపడడం, నిస్తేజంగా ఉండటం ప్రమాదకర లక్షణాలని.. అలా ఉంటే వెంటనే మంచి వైద్యం అందించాలని సూచిస్తున్నారు.



అస్తవ్యస్తంగా పారిశుధ్యం..

లోపించిన పారిశుధ్య కార్యక్రమాలు ..

గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతుండడంతో.. పారిశద్యం లోపించింది. అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పనుల్లోనే బిజీగా ఉంటుండడంతో.. గ్రామాల పర్యవేక్షణ లోపించింది. దాంతో పారిశుధ్యం సరిగ్గా లేక.. నేడు విష జ్వరాలు విజృంభిస్తున్నాయి.గతంలో వర్షాకాలం ప్రారంభం కాగానే.. నర్సు, గ్రామకార్యదర్శి, గ్రామ సర్పంచ్‌లకు కలిసి ప్రత్యేకంగా నిధులు ఇచ్చేవారు. వాటితో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు పైపులైన్‌ల లికేజీలకు మరమత్తులు, మురుగునీటి కాలువలు శుభ్రపరచడం, తాగునిటి ట్యాంకులను శుభ్రపరచడం లాంటి కార్యక్రమాలు చేపట్టేవారు. కానీ నేడు ప్రత్యేకాధిరుల పాలనలో ఇవీమీ సరిగ్గా జరగలేదు. దాంతో దోమలు వ్యాప్తి చెంది.. విషజ్వరాలు విజృంభిస్తున్నాయి.

కేసులు పెరుగుతున్న మాట వాస్తవేమ

-సంగారెడ్డి, డీసీహెచ్ఎస్

జిల్లాలో డెంగ్యూ కేసులు పెరుగుతున్న మాట వాస్తవమే. ఇప్పటికైనా ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలి. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఓక రోజు పారిశుధ్య దినంగా నిర్వహించి మున్సిపల్, గ్రామపంచాయతిల్లో ప్రజలకు అవగాహన కల్పిసున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. జిల్లాలో మందుల కొరత లేదు. ఆరోగ్య శ్రీలో డెంగ్యూకు చికిత్స అందిస్తున్నాం.

దళితులను ఆలయంలోకి రానివ్వకపోవడం సరికాదు..

- శివారు వెంకటాపూర్ గ్రామాన్ని సందర్శించిన దళిత సంఘాల నేతలు
- పునరావృతం అయితే ఉద్యమాలు ఉధృతం
- దళిత సంఘాల నేతలు
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-మర్కుక్

ఆలయ నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు దళితులను ఆలయంలోకి రానివ్వకపోవడం అమానుషమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి బి.శంకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మరాఠి కృష్ణమూర్తి, దళిత నేత మాజీ సర్పంచ్ నర్సింలు, దాసరి ఎంగొడ, వేణులు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని శివారు వెంకటాపూర్ గ్రామాన్ని దళిత సంఘాల అధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయ ప్రవేశాన్ని చేయించి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం మర్కుక్ పోలీసు స్టేషను ముందు నిరసన చేపట్టి వారు మాట్లాడుతూ దళితులను దేవాలయంలోకి రానివ్వని వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆధునిక యుగంలో దళితులను గుడిలోకి రాకుండా బోనాలు సమర్పించకుండా అడ్డుకోవడం అటవికం అమానుషమని దళితుల ఆత్మగౌరవం పై దెబ్బకొడితే సహించేది లేదని హెచ్చరించారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ దామోదర్‌లతో చర్చలు జరిపి నిందితుల పై కఠిన చర్యలు తీసుకొవాలని కోరారు. ఇరువర్గాలతో సీఐ చర్చలు జరిపారు. తగిన చర్యలు తీసుకుంటామని సి.ఐ తెలిపారు.

ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ

దుర్గా మతా ఉత్సవంలో దళితులు బోనాలు గుడివద్దకి అనుమతిచ్చమని, గుడిమెట్లు కూడా ఎక్కవదగ్గని దళితెతరులు అడ్డుకొవడంతో బోనాల నైవిద్యాన్ని కాలువలోని గంగాలో వేశారన్నారు. గ్రామాన్ని జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సందర్శించి దళితులకు అలయ ప్రవేశం కల్పించి దళితుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. దళితులను అవమాన పర్చిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గుడికి వెళ్ళి అవమానపడటం కంటె గుడులను బహిష్కరించి బాబాసాహెబ్ అంబెద్కర్ బాటలో పయాణించాలని దళితులకు సూచించారు. ఈ సంఘటన జరిగి నాలుగు రోజులు కావాస్తున్న తహసీల్దారు, ఆర్డీవో గ్రామాన్ని సందర్శించకపోవడంలో అంత్యమేమిటని ప్రశ్నించారు. శుక్రవారం దుర్గమాతకు బోనాలను సమర్పించాలని దళితులు నిర్ణయించుకన్నారు. ఈ లోపు గ్రామం అమానుష సంఘటనలు జరిగిన అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ దళితులు, మహిళలు, తదితరులున్నారు.



దళితులను గుడిలోకి రాన్నివ్వకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు

-గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి


మండల పరిధిలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో దళితులకు ఆలయాల ప్రవేశం లేదనడం బీసీల నిర్ణయం చట్ట విరుద్ధమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం మైతే శాఖ పరమైరన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ విషయమై గజ్వేల్ సీఐ మహేందర్ రెడ్డిని వివరణ కోరగా శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిదన దళితులు శిగురుపల్లి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు గుల్లపల్లి కిషన్ గౌడ్, కర్రెపుట్ట సత్తయ్య, శేరు వెంకటయ్య, బచ్చలి సత్తయ్య, తుమ్మల సత్యనారాయణ, మీద సెక్షన్ 352, వీఎస్ఎస్,3(1)ఆర్(ఎస్),(3)(1)జడ్ఏ(సీ) ఎస్సీ, ఎస్టీ పీఓపీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసు పై గజ్వేల్ ఏసీపీ పరిశోదన చేస్తున్నారని తెలిపారు.గ్రామంలో శాంతియుత వాతావరణానికి, విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలకు గురికాక తప్పదన్నారు.

కష్టంతో కాదు ఇష్టంతో చదవాలి

- జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్

నవతెలంగాణ-పుల్కల్

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ సూచించారు. పుల్కల్ మండల పరిధిలోని గొంగులూర్, కోడూరుప్రాథమిక పాఠశాలలను.. అలాగే పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ కళాశాలను, సింగూరు రెసిడెన్షియల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా ఉందా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పలు సలహాలు సూచనలు చేయడమే కాకుండా.. ప్రతీ విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. విద్యార్థుల పట్ల ఏ ఒక్క ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించిన తగు చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి శంకర్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి

- తహసీల్దార్ కార్యాలయాల వద్ద రేపు ధర్నా
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

2 లక్షల రైతురుణమాఫీ వెంటనే చేయాలని రేపు(గురువారం) మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కింద రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 22 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.17,933 కోట్లు మాత్రమే జమ అయ్యాయన్నారు. ఎన్నికల నాడు ఏకకాలంలో2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తానని వాగ్దానం చేసి, ఆచరణలో కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు 2.50 లక్షల మంది రైతులు ఉంటే, ఇప్పటి వరకు మూడు విడుతల్లో 97,873 మంది రైతులకు 846. 31 కోట్లు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. ఇంకా వేలాది మంది రైతులు రుణమాఫీ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు రేషన్ కార్డు పరిగణలోకి తీసుకోవడంతో అనేకమందికి మాఫీ కాలేదన్నారు.ఆధార్, బ్యాంక్ అకౌంట్, పట్టాపాస్ బుక్‌లో తప్పులు ఉన్న వారికి మాఫీకకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. టెక్నికల్ సమస్యను దృష్టిలో పెట్టుకొని రుణమాఫీ చేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే వాటిని కూడా సరి చేసి రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. రాజయ్య, మాణిక్యం, సాయిలు, నాయకులు పి.అశోక్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రక్తదానం చేయడం హర్షణీయం

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యార్థులు రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయమని జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు, కార్యకర్తలు వారి సంఘ 89వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదానం చేయాలని తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన వారెవరైనా ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. దాని వల్ల శరీరంలో యాక్టివ్ నెస్ వస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు సంఘ వార్షికోత్సవ దినోత్సవ సందర్భంగా ఇతర కార్యక్రమాలు పెట్టకుండా రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందించారు. రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తురెడ్డి మాట్లాడుతూ. విద్యార్థి సంఘం కేవలం విద్యార్థుల సమస్యలు వారి సమస్యల పట్ల పోరాటాలు ఆందోళన కార్యక్రమాలే కాకుండా మానవతా దృక్పథంతో సామాజిక సేవ కార్యక్రమంలో గత 89 ఏండ్లుగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు చేస్తున్నదన్నారు. రక్తదాన శిబిరాలు భారీ ఎత్తున జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి రాజు సిబ్బంది నాయకులు ఇసాక్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందంతోనే కవితకు బెయిల్

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం బీజేపీ, బీఆర్ఎస్ లోపాయి కారీ ఒప్పందంలో భాగమేనని.. కేంద్రం నుండి తెలంగాణకు నిధులు రాకున్నా మౌనంగా ఉండడం తెరచాటు బెయిల్ ఒప్పందంలో భాగమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఐఎన్టియూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి విమర్శించారు. పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అక్రమ లిక్కర్ వ్యాపారంలో కమిషన్లలో భాగంగా ఐదు నెలలుగా జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవితకు.. గత 15 రోజులుగా ఢిల్లీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వారి పార్టీ నాయకులు పూర్తిగా బీజేపీ నాయకుల ఇండ్లలో జరిగిన రహస్య ఒప్పందాల సారాంశమే వల్లే కవితకు బెయిల్ వచ్చిందన్నారు. ఆగస్టు 10వ తారీఖు నాడు మాజీ మంత్రి కేటీఆర్ పత్రిక సమావేశంలోనే బహిరంగంగా పది రోజుల్లో కవితకు బెయిల్ వస్తుందని చెప్పడంలో అంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ఈడి అరెస్టులో భాగంగా 19 ఐఫోన్లు పగలగొట్టిన ఎమ్మెల్సీ కవితను తప్పు పట్టని బీజేపీ, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది రాజ్యసభ సభ్యులు అభిషేక్ సింగ్వీని తప్పుపట్టడం ఏమిటన్నారు. ఈ దేశంలోనే అత్యంత ప్రముఖ న్యాయవాదుల్లో అభిషేక్ సింఘ్వీ ఒకరని తెలిపారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనోజ్ సిసోడియా 540 రోజులకు బెయిల్ వస్తే ఎమ్మెల్సీ కవితకు మాత్రం 150 రోజుల్లో బెయిల్ రావడంలో బీజేపీ పార్టీ తెర వెనుక పాత్ర ఉన్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన హైడ్రాను రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తలా ఒక రకంగా మాట్లాడడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఒక ఎంపీ హైడ్రా అవసరం ఉందని, ఒక ఎంపీ హైడ్రా అవసరం లేదని, ఒక ఎమ్మెల్యే హైడ్రాకు చట్టబద్ధత లేదని ఇంకొక ఎంపీ హైడ్రాతో చెరువులు కుంటలు అక్రమాలకు జరగకుండా అరికడతారని ఇలా రాష్ట్రంలో బీజేపీ పార్టీ నాలుగు ముక్కలుగా చీలిపోయిందని ఆరోపించారు. ఎవారికి వారు వారికి తగినట్టు మాట్లాడడం రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్ మోరే, నాయకులు సాయిలు ముదిరాజ్, అక్షిత్, సిద్దేశ్వర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్సి, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

- అంబేద్కర్ అభయహస్తం కోసం విధి విధానాలు రూపొందించాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని.. అంబేద్కర్ అభయ హస్తం కోసం విధివిధానాలు తక్షణమే రూపొందించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్లో మంగళవారం జరిగిన కేవీపీఎస్ కార్యకర్తల సమావేశంలో అతిమేల మానిక్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు దళిత గిరిజనుల కోసం కాంగ్రెస్ ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు ఏడాది గడిచిందని.. ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం కోసం రూ.2000కోట్లు బడ్జెట్‌లో ప్రకటించారని.. ఆ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. దళితుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. సాంఘీక సంక్షేమ మంత్రిని నియమించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. తక్షణమే పెండింగ్ ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. 2018 నుంచి ఎస్సీ కార్పోరేషన్ రుణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే పెండింగ్ రుణాలు విడుదల చేయాలన్నారు. సాంఘీక సంక్షేమ మంత్రి లేకుండా దళితుల సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రగల్బాలు పలుకున్నదన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ హాస్టళ్ల యాత్రలో తమ దృష్టికి ఎన్నో సమస్యలు వచ్చాయన్నారు. కాలేజ్ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2500కు పెంచాలన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. విద్యార్థుల ప్యాకెట్ మనీ రూ.1000 పెంచుతూ జీవో విడుదల చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలపై సెప్టెంబర్ 2న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, దత్తు, నాయకులు సోల్మాన్, రాజు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మనూర్

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నారాయఖేడ్ ఎమ్మెల్యే డా. పి సంజీవ్ రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. మండల కేంద్రాలమైన మనూర్, నాగల్గిద్దాలో లబ్దిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాలడుతూ.. ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె దిగంబర్ రెడ్డి, సిద్ధారెడ్డి, రాజు, అశోక్ రావ్, దత్తు, బీరదార్ శివాజీరావు, వెంకట్ రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మండలంలోని వివిధ గ్రామాలకు సంబదించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ హామీని నెరవేర్చడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆర్డీఓ, తహసీల్దార్, ప్రభుత్వ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా మండలంలోని కారసగుత్తి ఆసుపత్రికి కొత్త అంబులెన్సును ఖేడ్ ఎమ్మెల్యే డా.పి సంజీవ్ రెడ్డి మంగళవారం ప్రారంభిం చారు. రోగులకు ఈ అంబు లెన్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది కాబట్టి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పండరినాథ్, దొండిరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతం పరిశోధక విద్యార్థి చంద్రప్రకాష్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

డెంగ్యూ వైరస్ నిరోధాలపై అధ్యయనం చేసి, విశ్లేషించి, ఔషధ రూపకల్పన విధానంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి కె.చంద్రప్రకాష్‌ని డాక్టరేట్ వరించింది. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాంబాబు గుండ్ల ఈ విషయాన్ని వెల్లడించారు. డెంగ్యూ వైరస్ సంక్రమణ మానవులలో తీవ్రమైన జ్వర సంబంధమైన వ్యాధిని కలిగిస్తుందని, అది కొన్ని సార్లు ప్రాణాంతకంగా కూడా మారుతుంన్నారు. ఈ వైరస్ దోమల కాటు ద్వారా మానవులలో వ్యాపిస్తుందని, అది వేగంగా పునరావృతం అవుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం విశ్వవ్యాప్తంగా ఏటా సుమారు 39 కోట్ల మంది డెంగ్యూ బారిన పడుతున్నట్లు చెప్పారు. ఈ సిద్ధాంత వ్యాసంలో డెంగ్యూ వైరస్ సమ్మేళన నిరోధకేతర క్రమాభివృద్ధిని వివరించినట్లు తెలిపారు. డెంగ్యూ, జన్యుపర అభివృద్ధికి వ్యతిరేకంగా కొత్తగా జనించే వర్షన్ నిరోధక సమ్మేళనాల శ్రేణిని రూపొందించే విధానాన్ని సూచించా మన్నారు. ఈ పరిశోధనలో ఎటువంటి విష ప్రభావం లేని డెంగ్యూ వైరస్ సమ్మేళన నిరోధకేతరాలను సాధించామని, ఈ శాస్త్రీయ ప్రయోగాలు రెండు అంతర్జాతీయ ప్రచురణలలో అంగీకరించబడ్డాయని తెలిపారు

జహీరాబాద్ ఏవోగా లావణ్య



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారి(ఏవో)గా ఎస్.లావణ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. న్యాల్కల్ మండలం నుంచి బదిలీపై జహీరాబాద్‌కు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ప్రవీణ చౌటకూరు మండలానికి బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలంగా జహీరాబాద్ నియోజకవర్గం లో విధులు నిర్వహిస్తున్న లావణ్య.. రైతులకు మెరుగైన సేవలు అదించేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని గంగారం ఉన్నత పాఠశాలకు చెందిన 153 మంది విద్యార్థులకు 'యూత్ ఫర్ సేవా' అనే సంస్థ వారు బ్యాగులు, నోట్ బుక్స్, డిక్షన రీలు ,స్టేషనరీ కిట్స్‌ను మంగళవారం అందజేశారు. సాఫ్ట్వేర్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగు లు.. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాయం చేయాలని ఇలా ంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నాయకులు హరీష్, సాయి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పండరి నాయక్, ఉపాధ్యాయులు రాఘవేంద్ర, సంతోష్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తించాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేయాలని కల్‌బేమల్ గ్రామానికి చెందిన రైతులు బోజిరెడ్డి, శివరాజ్ పాటిల్, మారుతి పాటిల్, స్వామి దాస్‌లు డిమాండ్ చేశారు. రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్నప్పటికీ మాఫీ ఎందుకు వర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకర్ల, అధికారుల నిర్లక్ష్యంతో రుణాల మాఫీ కాలేదని మండిపడ్డారు. కాగా రుణమాఫీ కోసం నిత్యం బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఎలాంటి షరతులు లేకుండా పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు



నవతెలంగాణ-నారాయణఖేడ్

ఎమ్మెల్సీ కవిత జైలు నుంచి విడుదలైన సందర్భంగా నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదేశానుసారం రాజీవ్ చౌక్ వద్ద పార్టీ శ్రేణులు మంగళవారం సంబురాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లిక్కర్ స్కాం అనే కుట్ర కోణంతో పెట్టిన కేసులో దాదాపు 166 రోజులపాటు తీహార్ జైల్లో గడిపి.. ఏ ఆధారాల్లేకుండా రాజకీయ ప్రేరణతో పెట్టిన కేసులో కవితకు బెయిల్ దొరికిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు నవాబ్,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మాజీ ఎంపీటీసీ ముజామిల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అంబదాస్, లయక్, గోపాల్, ఉబెద్, సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు జగదీశ్వర చారి తదితరులు ఉన్నారు.



మునిపల్లి : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరవ్వడం హర్షించదగ్గ విషయమని మాజీ జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా అసత్యాలతో అన్యాయంగా కేసులు పెట్టి జైలు పాలు చేశారని ఆరోపించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి గెగోయ్ బెయిల్ మంజూరు సందర్భంగా మాట్లాడుతూ.. కవితపై చేసిన ఆరోపణలపై ఆధారాలు చూపలేకపోయారని దర్యాప్తు సంస్థల గురించి వ్యాఖ్యానించడం రాజకీయ కక్షలకు పాల్పడే వారికి ఒక చెంపపెట్టు లాంటిదన్నారు.

రుణమాఫీ పేరుతో మోసం



నవతెలంగాణ-సిర్గాపూర్

ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ సీనియర్ నాయకుడు అరుణ్‌రాజ్ శేరికార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గంటకో మాట చెబుతూ రైతులను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అన్యా యం చేస్తే సహించేది లేదన్నారు. అలాగే హైడ్రా పేరుతో ఎన్- కన్వెన్షన్ ఒకటి కూల్చి.. ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అసదుద్దీన్ ఓవైసీ చేపట్టిన అక్రమ కట్టడాలను కూల్చేయాలని సవాల్ విసిరారు.

రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- శానిటేషన్‌లో నిర్లక్ష్యం చేయొద్దు
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచనలు





నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా.. వైద్యులు రోగులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. అందోల్-జోగిపేటలోని ఆయా వార్డులను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. అందోలులోని ఐదవ వార్డులో ఇంటింటికి తిరుగుతూ శానిటేషన్ డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంటి లోపల, బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.కాగా కాలనీ ప్రజలు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. వాటన్నింటి పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే చెత్తాచెదారం ఉండకూడదని, నీటి నిల్వ చేయకూడదని మున్సిపల్ కమిషనర్ తిరుపతిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు డ్రై డే కార్యక్రమానికి సంబంధించి ముగ్గురితో టీంను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల బాగోగులను తెలుసుకోవాలన్నారు. ఎవరైనా జ్వరాల బారిన పడితే వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించే చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. పిచ్చి మొక్కలు పెరిగిన, నీటి నిల్వలు ఉన్న వెంటనే తొలగించాలన్నారు. ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. డాక్టర్లు సరిగ్గా చూడడం లేదని రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో అక్కడే ఉన్న సూపరింటెండెంట్ సౌజన్యను ఆ విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రిపూట డ్యూటి డాక్టర్ ఇన్ పేషంట్లను పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి రాగా.. అత్యవసర సేవలతోపాటు ఇన్ పేషంట్లను కూడా చూసుకోవాని సూచించారు. డెంగ్యూ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లకు సూచిస్తూ.. పేషంట్లతో ఆమె మాట్లాడారు. జ్వరం తగ్గేంతవరకు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని వైద్యులకు ఆదేశించారు. డాక్టర్లు పట్టించుకోవడంలేదని 14వ వార్డుకు చెందిన స్వరూప అనే పేషంటు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సెలైన బాటిల్ ఎక్కించేందుకు నరానికి సూది పెట్టేటప్పుడు జూనియర్లతో పెట్టించడంతో ఇబ్బంది పడ్డానని పేషంటు తెలిపారు. నర్సులు పెట్టకుండా జూనియర్లతో ఎందుకు పనులు చేస్తున్నారని కలెక్టర్ మండిపడ్డారు. వైద్య సేవలు, వైద్యులపై రోగులు ఫిర్యాదులు చేయడం ఏమిటని సూపరింటెండెంట్‌ను హెచ్చరించారు. రోగుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. అంత కుముందు అందోల్‌లోని బస్తీ దవఖానాను ఆమె తనిఖీ చేశారు. డాక్టర్, నర్సులకు డ్రెస్‌కోడ్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇద్దరూ వచ్చిన పేషంట్ల సంఖ్యను హెచ్చుతగ్గులు చెపడంతో ఆమె ఆశ్చర్యపోయారు. ప్రతిరోజు ఎంతమందికి సేవలందిస్తున్నారో సరిగ్గా చెప్పడం లేదని మండిపడ్డారు. వైద్య సేవలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా.. చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఎంపీడీవో రాజేష్ కుమార్, ఉప తహసిల్దార్ మధుకర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ ఎస్ఐ వినయ్ కుమార్, మెప్మా కోఆర్డినేటర్ బిక్షపతి తదితరులు ఉన్నారు.

సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సిబ్బంది జాగ్రత్తతో విధులు నిర్వహించి.. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి అన్నారు. జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలను, కోహిర్ మండల వైద్యశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విష జ్వరాలు.. డెంగ్యూ మలేరియా లాంటివి జిల్లాలో విస్తరిస్తున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగుల పట్ల అసభ్యంగా వ్యవహరించినా, సరైన వైద్యం అందించకపోయినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విష జ్వరాలను దృష్టిలో పెట్టుకొని సరిపడా మందులను పీహెచ్‌సీలు, వైద్యశాలకు సరఫరా చేశామన్నారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు జరుగుతూనే ఉంటాయని..కాబట్టి వైద్యులు, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ వైద్యశాలలోని ఐసీయూ బేబీ కేర్ సెంటర్ ఇన్ పేషెంట్లుతో మాట్లాడి సిబ్బంది అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-గుమ్మడిదల

సీజనల్ వ్యాధులు.. విష జ్వరాలు రాకుండా ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపంచుకోవాలని డీఎల్పీఓ వి.అనిత సూచించారు. మండలంలోని అన్నారం పంచాయతీ పరిధిలో గల కేసీఆర్ కాలనీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇండ్లలోని మురికి తొట్లు.. పనికిరాని డబ్బాలు, చెత్తాచెదారాలపై దోమలు, ఈగలు వాలి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. కాబట్టి నీరు నిల్వ లేకుండా.. చెత్తాచెదారం లేకుండా ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సంగీత సిబ్బందితో పాటు ఇంటి యజమానులతో పరిసరాల పరిశుభ్రత చేయించారు. చెత్త వాహనంలోనే చెత్త వేయాలని.. బహిరంగంగా పడేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విష జ్వరాలు వచ్చిన కుటుంబ సభ్యులను డీఎల్పీఓ కలిసి మాట్లాడించారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కాలనీ ప్రధాన రహదారులగుండా బ్లీచింగ్ పౌడర్‌తో పాటు దోమలు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో పాటు ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి మాత్రలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్ రావు, ఎంపీహెచ్ఎ (ఎఫ్) వసంత, జూనియర్ అసిస్టెంట్ సతీష్, అంగన్వాడి టీచర్ ఫాతిమా ఆశ వర్కర్ డి.సరిత గ్రామస్తులు దేశబోయిన వెంకటేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ముదిరాజులకు అండగా ఉంటా

తెలంగాణ ముదిరాజు ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-వట్‌పల్లి

తెలంగాణలో ముదిరాజ్‌లు రాజకీయంగా, విద్యా ఉద్యోగ పరంగా వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ బోర్ర వెంకటేశం తెలిపారు. మండల కేంద్రమైన వట్‌పల్లిలో కొరివి కుమార స్వామి 132వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ముదిరాజ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల పరిధిలోని దుద్యాల గ్రామ శివారులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజు కులస్తులను విద్యా, వైద్య పరంగా పెద్ద పీట వేసేందుకు తాను కృషి చేస్తానన్నారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుండి ఏ లోకి మార్చడానికి సంబంధిత మంత్రితో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ము ఖ్యమంత్రి కట్టుబడి ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ రాష్ట్ర ముదిరాజ్ ఉపాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా ముది రాజ్ అధ్యక్షులు రాజు, తెలంగాణ రాష్ట్ర మహాసభ సపరేట్ బ్యూరో సభ్యులు బి.నారాయణ, వట్‌పల్లి మండల ముదిరాజ్ అధ్యక్షులు గంగారాం, భాగన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్స్, వర్కర్స్‌కి జీతాలు పెంచాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మున్సిపల్‌లో పనిచేస్తున్న డ్రైవర్స్, వర్కర్స్‌కి జీతాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు మంగళవారం వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని ఇతర మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న మున్సిపల్ డ్రైవర్లకు రూ.19,500 చెల్లిస్తున్నారని, నారాయణఖేడ్ మున్సిపాల్టీలో పనిచేసే డ్రైవర్స్ కూడా అదే పద్ధతిలో జీతాలు చెల్లిం చాలన్నారు. అలాగే మున్సిపల్ వర్కర్స్‌కు పెరిగిన ధరలకు అనుకూలంగా జీతాలు పెంచి.. వారిని పర్మినెంట్ చేయాలన్నారు. జీతాలు సరిపోక కుటుంబం గడిచే పరిస్థితి లేదని.. దాంతో వర్కర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆ కార్మికులు చేసే పని విధానం వల్లనే మున్సిపల్ నారాయణఖేడ్ ప్రాంతం పరిశుభ్రంగా ఉంటుందని వారికి జీతాలు పెంచడంలో తప్పేమీ లేదన్నారు. కాబట్టి వెంటనే మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. లేనియెడల సీఐటీ యు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సతీష్, మున్సి పల్ యూనియన్ వర్కర్స్ రవి, నాగయ్య, సాయిలు, గోపా ల్, జై పాల్ రాజు,విట్టల్,దినేష్,ఇస్మాయిల్,బాల్రాజ్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలో లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రమేష్ జ్యోషి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయడంలో వివక్షత పాటించిందని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి వివక్షత లేకుండా అందరికీ చెక్కులు మంజూరు చేస్తున్నదన్నారు. గొర్రెకల్ గ్రామానికి చెందిన రైపల్లి బీరప్ప సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకొని మూడేండ్లవుతున్నా.. మంజూరి చేయించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రికార్డులను పరిశీలించగా.. బీఆర్ఎస్ వివక్షత బయటపడిందన్నారు. కాబగా బాధితుడికి వెంటనే రూ.25 వేల చెక్కును ఈ ప్రభత్వం మంజూరు చేసిందన్నారు. మండల వ్యాప్తంగా 45 మందికి కోటి 1,30,000 రూపాయల చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేడికుంద మాజీ ఎంపీటీసీ శంకరప్ప, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ శాఖ అధికారుల గ్రామాల బాట

నవతెలంగాణ-జహీరాబాద్

వివిధ కారణాలతో రుణమాఫీ జరగని రైతులను వ్యవసాయ శాఖ అధికారులు నేటి నుంచి నేరుగా కలిసి వివరాలు సేకరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి ఫెరీజులను తీసుకొని ప్రతి కుటుంబానికి వెళ్లి సమగ్ర విచారణ జరిపించి ఆన్లైన్ ద్వారా వివరాలను నమోదు చేయనున్నట్టు వ్యవసాయ శాఖ ఏడి బిక్షపతి తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరికీ రుణాలు ఉంటే ఒకరికి మాత్రమే రెండు లక్షల మాఫీ జరుగుతుందన్నారు. రెండు లక్షల కంటే ఎక్కువ అప్పు ఉంటే.. డబ్బులను కట్టడానికి ప్రభుత్వం ఒక తేదీని నిర్ణయిస్తుందన్నారు. దాని ఆధారంగా మిగతా డబ్బులు చెల్లిస్తే రెండు లక్షల రూపాయలు కూడా ఆ రైతులకు కూడా మాఫీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్ల తెలిపారు. ఇందుకు రైతులు తమ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల వలయంలో రాఘవాపూర్



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రాఘవాపూర్ గ్రామ పంచాయతీ సమస్యలతో సతమతమవుతున్నది. మండల కేంద్రానికి దూరంగా ఉండడంతోనే తమ గ్రామాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతు న్నారు. పంచాయతీకి సంబంధించిన చెత్త ట్రాక్టర్ కొన్ని నెలలుగా నడవడం లేదు. అలాగే గ్రామ దంపుయార్డ్‌కు రోడ్డు లేదు. దాంతో ప్రజలు వారికి సంబంధించిన స్థలాల్లో, రోడ్ల వెంబడి చెత్తను పార బోస్తున్నారు. వర్షాకాలం కావడంతో నీటి నిల్వ వల్ల దోమలు వ్యాప్తిం చెందా యని.. పారిశుధ్యం కూడా సరిగ్గా లేకపోవడంతో ఈ సమస్య మరింత జఠిలం అయిందన్నారు. దాంతో రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోం దని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని రత్నపురి విద్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపల్ ఆశా మేడమ్ మాట్లాడుతూ.. ధర్మానికి, న్యాయానికి ప్రతిరూపం శ్రీకృష్ణ భగవానుడు అని అన్నారు. కాగా చిన్నారులు వేసిన శ్రీకృష్ణ, గోపికలు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-చౌటకూర్

సంగారెడ్డి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో చౌటకూర్ మండల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సుల్తాన్‌పూర్ మహేష్, చౌటకూర్ మండల అధ్యక్షులుగా బోనాల గంగారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గంగారం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతను ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. సంఘంలో ఎలాంటి సమస్యలున్న పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా ఉపాధ్యక్షులుగా కొర్పోల్ ప్రశాంత్, జనరల్ సెక్రెటరీగా శివంపేట మల్లేశం, రమేష్, అంగడిపేట రంగయ్య ,సభ్యులుగా నాగేష్, రాజు, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పై రైతులకు అవగాహన



నవతెలంగాణ-కౌడిపల్లి

సోలార్ పై రైతులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం, తునికి నందు నేషనల్ స్కిల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వార పీఎం కుసుమ్ యోజన పై అవగాహన వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి, చీఫ్ మోడరేటర్ పునరుత్పాదక శక్తి యొక్క ప్రాముఖ్యత, వ్యవసాయ కార్యకలాపాలకు ప్రత్యామ్నాయ శక్తి వనరుగా సౌరశక్తిని ఉపయోగించడం గురించి వివరించారు. భాను శ్యామ్, ట్రైనర్ పీఎం కుసుమ్ కాంపోనెంట్స్ గురించి, సోలార్ ప్యానెళ్ల ద్వారా సోలార్ ఎనర్జీ ఉత్పత్తిలో ఉన్న అవకాశాల గురించి వివరించారు, ఎంపిక ప్రమాణాలు, అవసరమైన భూమి, పెట్టుబడి గురించి కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త ఉదయ్ కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, నిజాంపేట ఎఫ్‌పియం సభ్యులు, తొగిట మెదక్ జిల్లా రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో కలెక్టర్ పరిశీలన



నవతెలంగాణ-మెదక్‌టౌన్

స్థానిక మెదక్ పట్టణంలోని పిల్లి కొట్టాల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం అధికారులతో పరిశీలించా రు. డిపార్ట్మెంటల్ తరగతి గదులు, ల్యాబులు, ప్రయోగశాలలు, వివిధ రకాల వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని రకాల వసతులతో పాటు విద్యార్థులు నేర్చుకోవడానికి అనువైన అన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివ దయాల్, ప్రిన్సిపల్ రవీందర్, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వచ్చే రోగులను నిర్లక్ష్యం చేయొద్దు

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఆస్పత్రిలో మందుల కొరత రానియొద్దు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-నర్సాపూర్

ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు చికిత్సలు అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఆసుపత్రిలో ప్రతి వార్డు తిరుగుతూ రోగులతో మాట్లాడారు. ప్రతి రోగి దగ్గరికి వెళ్లి పలకరించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నావి, హాస్పిటల్లో ఏదైనా సమస్యగా ఉందా? అంటూ అన్ని వార్డుల్లో ఉన్న రోగులను వివరాల అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టోర్ రూమును పరిశీలించి సిబ్బందిని మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో కేవలం మూడు తీవ్ర జ్వర కేసులు మాత్రమే ఉన్నాయని, అవి కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. అంటూ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైరల్ ఫీవర్, డెంగు, మలేరియా లాంటివి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గుంతలలో మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి అని ఆయన అన్నారు.నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమల వ్యాప్తిని అరికట్టడానికి కిరోసిన్, క్రూడ్ ఆయిల్‌ను చల్లడం ద్వారా దోమలను నివారించవచ్చని ఆయన తెలియజేశారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా,చికెన్ గున్యా తదితర వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఇండ్లల్లో నీటి నిలువలు లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవలన్నారు.

ఇంటి పరిసరాలలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, వాడిన టీ కప్పులు, ఇతర నీటి నిలువలు గల చిన్న పాత్రలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వారానికి ఒక సారి నీటి పాత్రలను శుభ్రపరచి నీటిని నింపుకోవాలనీ, ఇండ్లలో వాడే కూలర్స్, ఫ్రీజ్, ఏసీలలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకొని జాగ్రత్త పడాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తించి ఇలాంటి వాటివల్ల సీజనల్ వ్యాధులు వస్తాయని ఇలాంటి వాటిని నిర్మూలించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పాడుబడిన బావులను, కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లను తొలగించాలని, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరీక్షలు జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్లు మిర్జా బేగ్, డాక్టర్లు రాజ్ కుమార్, వంశీ సిబ్బంది ఉన్నారు.

హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ



నవతెలంగాణ-చేర్యాల

జూనియర్ డాక్టర్ పై అత్యంత అమానుషంగా అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలనిసీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్జి కార్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో పీజీ రెండో ఏడాది చదువుతున్న వైద్య విద్యార్థినిని దారుణంగా హింసించి అత్యాచారం జరిపి హత్య చేశారని, మహిళలకు ఎలాంటి రక్షణ కల్పించకుండా పాలకులు, అధికార యంత్రాంగం ఘోర వైఫల్యం చెందిందని విమర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్, పోలీసులు వాస్తవాన్ని పక్కదారి పట్టించే విధంగా వ్యవహరించిన తీరు దుర్మార్గమైనదని అన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మహిళ పైన రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్న వారికి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మెడికల్ కళాశాల ఆసుపత్రిలో మహిళా వైద్యులు, నర్సుల కోసం ఉద్యోగ రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ చేర్యాల పట్టణ కన్వీనర్ రాళ్ల బండి భాస్కర్, సంతోష్, హరికృష్ణ, అనిల్ కుమార్, అంజయ్య, పద్మలక్ష్మి, మల్లమ్మ, కనకవ్వ, అండాలు, మమత, కార్మికులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎనలేనిది



నవతెలంగాణ-టేక్మాల్

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎనలేనిదని ఆ వృత్తికి సాటి మరో వృత్తి లేదని మండల విద్యాధికారి నీలకంఠమన్నారు. మంగళవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనటువంటిది అన్నారు. ఉపాధ్యాయుడు తన జీవితకాలమంతయు పిల్లల భవిష్యత్తును భావితరాలకు అందించడం కోసం తీర్చిదిద్దే పనిలో ఉంటాడన్నారు. కుటుంబానికి సైతం సమయాన్ని కేటాయించక పాఠశాలకే సమయం కేటాయిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాడు అన్నారు. ఉపాధ్యాయుడు సమాజానికి ఉపయోగపడే అన్ని రకాల వనరులను తయారు చేసే, నిపుణులనుగా తీర్చిదిద్దుతాడని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, శంకర్రావు, వెంకటేశం, రాందాస్, టీపీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు అమిరుద్దీన్, ఉపాధ్యాయులు రమేష్, తదితరులు ఉన్నారు.

ఓపెన్ జిమ్ కోసం ఎస్సై ఆర్థిక సాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ము కోసం స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి రూ.15,116 లను ఆరోగ్యమే మహాభాగ్యం గ్రూప్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ఆరోగ్యమే మహాభాగ్యం గ్రూపు సభ్యులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వారిని అభినందించదగ్గ విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని ఉద్దేశంతో ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. సమాజానికి ఉపయోగపడే ఏ పనికైనను తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. వ్యాయామం వలన మంచి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎలాంటి రోగాలు దరిచేరమన్నారు . ఈ కార్యక్రమంలో బట్ట మహేష్, జిపి స్వామి, సిహెచ్ ప్రసాద్, వినయ్, వెంకట్ రెడ్డి, సిద్దరాంరెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులు ముగ్గురే టీచర్లు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో దాదాపు నాలుగేళ్ల క్రితం 350 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 200 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ టీచర్లు మాత్రం ముగ్గురే ఉన్నారు. వాస్తవానికి ప్రభుత్వ నిబంధన ప్రకారం 30 మంది విద్యార్థులకు 1 ఉపాధ్యాయుడు ఉండాలి కానీ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడం వలన విద్యార్థులకు చదువు చెప్పే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దాదాపు 9 మంది ఉపాధ్యాయులు అవసరం కానీ విద్యాశాఖ నిర్లక్ష్యం వలన విద్యార్థుల జీవితాలు అగమ్య గోచరంగా తయారయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఎంఈఓను అడిగితే మా చేతుల్లో ఏమీ లేదు అంటూ దాటవేసే సమాధానంతో ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రాథమిక పాఠశాల మూతపడే పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి వెంటనే ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

మహంకాళి వార్షికోత్సవనికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రంలో గ్రామ దేవత మహంకాళి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు శుభ ఆహ్వానం కోరుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి, సీనియర్ నాయకులు మనోహర్ రావులకు ఆహ్వాన పత్రిక దుబ్బాక మండలంలోని పోతారం తన సొంత నివాసంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. చేగుంటలో ఆగస్టు 29వ తేదీ నుంచి మహంకాళి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమై సెప్టెంబర్ రెండవ తేదీ రోజున అన్నదాన కార్యక్రమం, ఫలహార బండి కార్యక్రమంతో ముగుస్తుందని ఇట్టి కార్యక్రమానికి ఖచ్చితంగా హాజరుకావాలని నాయకులు కోరారు. అమ్మవారి కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ రెండవ తేదీన ఫలహారం బండిని డిష్ రాజు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోమండ్ల నారాయణరెడ్డి, సంద్రుగు స్వామి, యువ నాయకులు డిష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కులగణన పట్ల హర్షం

నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్రంలో వచ్చే నెల నుంచి కుల గణన ప్రక్రియ ప్రారంభం పట్ల బీసీ సెల్ నంగునూరు మండల అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కుల గణన కోసం జీవో జారీ చేసి రూ.150 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. సాధారణ పరిపాలన విభాగం, పంచాయతీరాజ్, ప్రణాళిక శాఖలలో ఏదైనా ఒక శాఖ ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు ఖరారైన మేరకు చట్టం చేసి అమలు చేస్తారని అన్నారు. పార్టీపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తారని చెప్పారు. కుల గణన చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కామన్ ఎగ్జామ్ మిషన్ బోర్డు మెంబర్‌గా సోమేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు మెంబర్‌గా స్థానిక సాయి జీడీఆర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సోమేశ్వర్ రెడ్డిని నామినేట్ చేసినట్లు సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా సోమేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇంత పెద్ద అవకాశం తనకు ఇచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని సోమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అంతేకాకుండా ఈనెల 24న ఎడ్యుకేషన్ ఎగ్జామ్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును అందుకున్నందుకు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్‌లో పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలి

- కమిషనర్‌కు వినతి పత్రం అందజేత
- మాజీ మున్సిపల్ చైర్మెన్ బొంది రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ
- రూ.8 కోట్లతో తూప్రాన్‌లో ఆడిటోరియం నిర్మించాలి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలో పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని తూప్రాన్ మాజీ తొలి చైర్మెన్ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొత్త చైర్మెన్ కొలువుదీరిన వెంటనే తూప్రాన్ మున్సిపల్ పరిధిలో పెరిగిన ఇంటి పన్నులు, వాణిజ్య భవనాల పన్నులు పెంచి యాజమానుల నడ్డి విరుస్తున్నారని, వెంటనే పెంచిన పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. తూప్రాన్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు రవీందర్ గౌడ్ నాయకత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజుద్దిన్‌కు తన ఛాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొంది రవీందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాసం పెట్టించి కొత్త చైర్మన్ కొలువుదీరిన వెను వెంటనే తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ఒకేసారి రూ.500లు ఇంటిపన్ను ఉన్న స్థానంలో ఏకంగా రూ.15 వేలు టాక్స్ పెంచి భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. కొత్త మున్సిపల్ ఏర్పాటు అయిన తర్వాత 5 ఏళ్ల వరకు పన్నులు పెంచకుండా సడలింపు ఇచ్చారనీ, రూ.8 కోట్లతో తూప్రాన్ లో ఆడిటోరియం నిర్మించాలని, గతంలో మంజూరు చేసిన నిధులను ఉపయోగించాలన్నారు. పెద్ద చెరువు కట్టపై ఆధునీకరణ టూరిజం అభివృద్ధి చెందేలా సుందరీకరణ ఏర్పాట్లు చేయాలన్నారు. స్టేడియం కోసం మంజూరైన నిధులు పక్కదారి మళ్లించి, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ హయాంలో స్టేడియం నిర్మించాలని తీర్మానించి నిధులు మంజూరు చేయిస్తే కొత్త చైర్మెన్ నిధులు దారి మళ్లించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే పెంచిన ఇంటి పన్ను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు బొంది అరుణ వెంకట్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.కే.సత్తార్, యూత్ లీడర్ శ్రీకాంత్ చారి, గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు .

డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందజేయాలని వినతి పత్రం



నవతెలంగాణ-చేగుంట

ఇటు ఇల్లు స్థలం లేక, అటు ఇల్లు కట్టుకునే స్తోమత లేక నానా ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు గత ప్రభుత్వం కట్టించిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిరుపేదలకు ఇప్పించేలా చూడాలని చేగుంట తహసీల్దార్‌కు మంగళవారం సీఐటీయూ ఉపాధ్యక్షురాలు జి.బాలమణి, లబ్దిదారులతో కలిసి వినతి పత్రన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. చేగుంటలో కిరాయిలు ఎక్కువగా ఉండడం, బీడులు చుట్టి బతుకుతున్న పేదలకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇంట్లో కిరాయికి ఉంటున్న యజమానులు సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని, అలాగే చుట్టుపక్కల కంపెనీలు ఉన్న తమకు ఎటువంటి పని దొరకడం లేదని, కనుక ఈ నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చేలా ప్రత్యేక చొరవ చూపాలని, తహసీల్దార్ నారాయణకు సిఐటియూ ఉపాధ్యక్షురాలు బాలమని సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని పై అధికారులకు అందేలా చూస్తానని, పైనుంచి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వమని అనుమతులు వస్తే తప్పకుండా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు శ్యామల, సంతోష, సాధిక, రజని, సత్తమ్మ, రజిత, కౌసర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కుల జనగణన చేపట్టాలి

- సగర కుల జనగణన పూర్తి చేసి మేమే ప్రభుత్వానికి నివేదిస్తాం
- సగర సంఘం జిల్లా అధ్యక్షులు సందిల సాయిలు సగర



నవతెలంగాణ-టేక్మాల్

రాష్ట్రంలో కుల జనగణన ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, ఇక సగర కుల జనగణన తామే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని సగర సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు సందిల సాయిలు సగర అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లంపల్లిలో సగర కుల జనగణన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర నాయకత్వంలో తాము 32 అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో సగరకుల జన గణనను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ సంఘాలుగా అనేక సంవత్సరాలుగా తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ముందుకు రావడం లేదని అన్నారు. ప్రభుత్వాలు పాలకులపై తమకు నమ్మకం పోయిందని, ఇక తమ కులం యొక్క జనాభా లెక్కలు సమగ్ర సమాచారంతో తామే సేకరించి ప్రభుత్వము ముందు పెట్టబోతున్నామని ఆయన ప్రకటించారు. రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుల గణన పూర్తి చేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ముందు నివేదిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సగర కులస్తులు ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేసి సగరుల చైతన్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. అన్ని మండలాల్లో వెంటనే సమగ్ర కుల గణన ప్రారంభించాలని సూచించారు. ఎల్లంపల్లి సగర సంగం అధ్యక్షులు ఉప్పరి బుచ్చయ్య, సగర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర సగర సంఘం సంయుక్త కార్యదర్శి మర్కు దత్తాత్రేయ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర, జిల్లా కోశాధికారి ద్యాప బాలకిషన్ సగర, జిల్లా యువజన సంఘం కోశాధికారి ఉప్పరి సాయిలు సగర, గ్రామ నాయకులు పండరి సగర, పెద్ద సాయిలు సగర, గ్రామ సగర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పట్టవా..?

- జిల్లా అధ్యక్షులు కొండి లక్ష్మణ్



నవతెలంగాణ-టేక్మాల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు ఎందుకు అని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొండి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మెదక్లో భవన నిర్మాణ కార్మిక సంఘం నాల్గవ మహా సభలను నిర్వహించారు. అనంతరం హాజరైన కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఏసీఎల్ భవనంలో ఉన్న అధికారులు సక్రమంగా పనిచేయకపోవడంతో, భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారు ఆకస్మికంగా మరణిస్తే వారికి రావలసిన బెనిఫిట్‌లను సక్రమంగా అందడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో అధికారి లంచాలకు అలవాటు పడి పేద ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ రంగంలో కార్మికులు రెక్కాడితే గాని డొక్క నిండాలేని పరిస్థితిలో ఉన్నవారు లంచాలు ఎలా ఇస్తారని ఆయన ఏసీఎల్ అధికారులను నిలదీశారు. ఈ రంగంలో పని చేస్తున్న కార్మికులు ఆకస్మికంగా మరణించి ప్రమాదవశాత్తు మరణించి తమ పెద్దదిక్కును కోల్పోతుంది. కాలు చేతులు విరిగి అంగవైకల్యం ఏర్పడి జీవితాంతం మంచానే పడి చేస్తున్నారన్నారు. 55 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.6000 పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ సంబంధించిన వాటిని అందరికీ వర్తింపజేయాలని చెప్పారు. ప్రతి కార్మికునికి తమ సంఘం తరఫున ఐడెంటి కార్డులు ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి పద్మ ఎల్లంపల్లి, చేత గిరి యాదమ్మ, ఎల్లంపల్లి పరిణ బేగం, పెద్ద శంకరంపేట్ బేగారి లింగం తదితరులు ఉన్నారు.

జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మాధవి

- జిల్లా అధికారి సన్మానించిన టీజీఎల్‌ఏ నాయకులు



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీఐఈఓ)గా మెదక్ లోని బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. గతంలో డీఐఈఓగా పనిచేసిన సత్యనారాయణ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేపడుతున్న నేపథ్యంలో జిల్లాలో సీనియర్ ప్రిన్సిపాల్ గా ఉన్న మాధవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో మెదక్ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు తనవంతు ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండే కళాశాలలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కళాశాలలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిజీఎల్ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీపతి సురేష్ బాబు ఆధ్వర్యంలో సంఘం నేతలు కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షులు ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్, కోశాధికారి సంజీవ్ జిల్లా నాయకులు అజీమ్, పాల్గొన్నారు.

కడిగిన ముత్యంలా బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత

- మెదక్ మున్సిపల్ తాజా మాజీ చైర్మెన్ అరెళ్ళ మల్లికార్జున్ గౌడ్



నవతెలంగాణ-మెదక్ టౌన్

కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో గత ఏడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సుప్రీం కోర్ట్ వారిపై చేసిన అభియోగాలు పరిశీలించి మంగళవారం బెయిల్ మంజూరు చేసినందున హర్షం వ్యక్తం చేస్తూ మెదక్ పట్టణం రాందాస్ చౌరస్తాలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ (బీఆర్ఎస్ పార్టీ) ఆధ్వర్యంలో బానసంచ కాల్చి సంబరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుంది వారిపై చేసిన అభియోగాలు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగమే, ఇకపై వారి కార్యచరణ తెలంగాణ రాజకీయాలలో ఒక మార్పును తెస్తుందని భావిస్తూ మహిళ నాయకురాలిపై చేస్తున్న ఆరోపణలు అభియోగాలు విరమించుకొని సురక్షిత్ భారత్ వైపు వారు అడుగులు వేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి , పట్టణ కౌన్సిలర్స్ వంజర్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మామిళ్ళ ఆంజనేయులు మెదక్ పట్టణ కన్వీనర్



ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉందని బీజేపీ ప్రభుత్వం అర్థం లేని కేసులో అక్రమంగా కల్వకుంట్ల కవితను ఇరికించడం దురదృష్టకరం న్యాయస్థానంపై నమ్మకమున్న బీఆర్ఎస్ పార్టీ తప్పకుండా వాస్తవాలు బయటకి వస్తాయని మెదక్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు అన్నారు. బీజేపీ ప్రభుత్వం కవిత అక్రమంగా అరెస్టు చేసి కేసీఆర్ మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఒక పథకం ప్రకారం బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి ఎన్నిన పథకమే అని బీఆర్ఎస్ పార్టీ నమ్ముతుంది, న్యాయం ఎప్పటికైనా న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని కవిత బేలు పై హర్షం వ్యక్తం చేస్తున్నాం అన్నారు.

ఆదర్శప్రాయుడు రావి కోటేశ్వర రావు

- శతజయంతిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

ఆదర్శ ప్రాయుడు, స్వాతంత్ర సమరయోధుడు రావికోటేశ్వరరావు ప్రజా సేవకు అంకితమై అందరి మన్ననలు పొంది శతజయంతి ఉత్సవాలు చేసుకోవటం సంతోషమని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కౌడిపల్లి మండలం రాయిలాపూర్ నర్సింగరావు ఫంక్షన్ హాల్‌లో కీర్తిశేషులు భూదాత కామ్రేడ్ రావికోటేశ్వరరావు వందవ పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతి నిధులు, పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాయిలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు జాతీయ రహదారి పక్కనే ఉన్న కోట్లు విలువ చేసే తన సొంత ఎకరం భూమిని పాఠశాలకు దానం చేయటం గొప్ప విషయం అని కొనియాడారు. అంతేకాకుండా పాఠశాల అభివృద్ధి, పిల్లల చదివే తన ధ్యేయమంటూ కుటుంబ సభ్యులు పాఠశాలకు ఎన్నో సేవలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం రావి కోటేశ్వరరావు భార్య కామాక్షమ్మకు శాలువా కప్పి ఎమ్మెల్యే మదన్ రెడ్డి సన్మానించారు. రావికోటేశ్వరరావుకు మెదక్ జిల్లాతో మంచి పరిచయాలు ఉన్నాయని గుర్తు చేశారు. పాఠశాలకు స్థలం ఇవ్వడంతోపాటు తన భార్య కామాక్షమ్మ అక్కడే తన పొలంలో ఇల్లు ఏర్పాటు చేసుకొని ఉంటూ పాఠశాలకు ఇప్పటికీ సహాయ సహకారాలు చేయటం సంతోషకరమన్నారు. కీర్తిశేషులు కోటేశ్వరరావు శతజయంతి ఉత్సవాలకు అమెరికా నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలివచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సున్నం సతీష్, దొంతుల దుర్గయ్య, రాజు, మాజీ సర్పంచ్ శేకులు, శివాంజనేయులు, నర్సింలు, రామాంజనేయులు, పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింలు, తదితరులు ఉన్నారు.

అక్రమ రేషన్ బియ్యాన్ని అరికట్టేది ఎట్లా..?



నవతెలంగాణ-నిజాంపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బీపీఎల్ అర్హులైన వారికి రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నది. రేషన్ కార్డుల వారి నుంచి కొందరు అక్రమార్కులు బియ్యాన్ని కొనుగోలు చేసి రూ.20 ల చొప్పున రైస్ మిల్ నిర్వాహకులకు అమ్ముతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని రైస్ మిల్లులోకి ఇతర గ్రామాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తీసుకువచ్చి తెల్లవారుజామున దొంగ చాటుగా సరఫరా చేస్తున్నారు. చీకటి వ్యాపారం చాలా సంవత్సరాల నుంచి నడుస్తున్నది. అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ బియ్యాన్ని పట్టుకునే స్పెషల్ అధికారులు కూడా ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సివిల్ సప్లై అధికారులు వెంటనే స్పందించి రైస్ మిల్లు నిర్వాహకులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పలువురు కోరుచున్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-మద్దూరు

మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల శేఖర్ (32) రోజు తాగుడుకు బానిస కావడంతో అతనికి అతని భార్య ఎన్నిసార్లు తాగుడు మానేయాలని చెప్పిన. తాగుడు మానకపోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో అతని భార్య తల్లిగారింటికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. మద్యం మత్తులో ఈనెల 20న శేఖర్ ఇంటిదగ్గర వ్యవసాయ బావుల వద్ద గడ్డికి కొట్టే మందును తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు చేర్యాల ఆసుపత్రికి తరలించారు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య అనుష, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు

పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-దుబ్బాక

ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం దుబ్బాక పట్టణంలోని బస్సు డిపో ఎదుట ఆర్టీసీ జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదల, అలాగే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని చెప్పి నేటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బకాయిలు, బాండ్ డబ్బులు, డీఏ, టీఏలు ఇంకా కార్మికులకు రావాల్సిన ఇతర బకాయిల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జేఏసీ నేతలు గోపాల్, రమేష్, అజీముద్దీన్, లింగం గౌడ్, పలువురు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి నిధులను దారి మళ్ళించొద్దు

- మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వాకౌట్ చేసిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ ప్రగతి కోసం వచ్చిన నిధులను దారి మళ్లించి ఖర్చు పెట్టవద్దని, పట్టణంలో మౌలిక వసతుల కోసమే ఖర్చు పెట్టాలని కాంగ్రెస్ కౌన్సిలర్ లు రియాజ్, సాకి బాల్ లక్ష్మీ ఆనంద్, పయ్యావుల పూర్ణిమ ఎల్లం, ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి, కవిత, ఎంఐఎం కౌన్సిలర్ మహమ్మద్ అబ్దుల్ నసీర్, బీజేపీ కౌన్సిలర్ రాధా వేణుగోపాల్ లు మున్సిపల్ చైర్ పర్సన్ ను డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగా, యెజెండాలో పొందుపరిచిన పట్టణ ప్రగతి నిధులను ఇతర పనులకు మరలించడానికి నిరసిస్తూ సమావేశం నుంచి వారు వాకౌట్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రగతి కోసం ప్రభుత్వం నిధులు ఇస్తుంటే, వాటిని కుల సంఘాల భవనాల కోసం ఖర్చు పెట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. తాము కుల సంఘాలకు వ్యతిరేకం కాదన్నారు. మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు నెల నెల జీతాలు ఇవ్వడం లేదని, వారికి జీతాలు ఇవ్వాలని కోరారు. మౌలిక వసతుల కల్పన కోసం మున్సిపల్ చైర్ పర్సన్ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల కోసం ఆలోచించాలని కోరారు.

పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- దుబ్బాకలో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-దుబ్బాక



ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం దుబ్బాక పట్టణంలోని బస్సు డిపో ఎదుట ఆర్టీసీ జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదల, అలాగే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని చెప్పి నేటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బకాయిలు, బాండ్ డబ్బులు, డీఏ, టీఏలు ఇంకా కార్మికులకు రావాల్సిన ఇతర బకాయిల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జేఏసీ నేతలు గోపాల్, రమేష్, అజీముద్దీన్, లింగం గౌడ్, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ప్రిన్సిపాల్‌కు సన్మానం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో సాయి జీడీఆర్ ఇంగ్లీష్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సోమేశ్వర్ రెడ్డికి నవతెలంగాణ పాత్రికేయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈనెల 24న ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును అందుకున్న సందర్భంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నవ తెలంగాణ పాత్రికేయులు నాయిని యాదగిరి మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో సాయి జీడీఆర్ పాఠశాల యజమాన్యం ప్రిన్సిపాల్ సోమేశ్వర్ రెడ్డి మంచి విద్యను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థుల విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ఫలితాలకు సాయి జీడీఆర్ వేదికగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడీవీటీ ఇన్చార్జి చెరుకు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లోరోఫిల్ ఆర్గానిక్‌తో పంటల సస్యరక్షణ

- ఉమ్మడి కరీంనగర్ రీజినల్ మేనేజర్ మహిపాల్
- లక్ష్మీపూర్‌లో క్లోరోఫిల్ ఆర్గానిక్ ఎరువులపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-బెజ్జంకి



వరి, పత్తి, కూరగాయల పంటల సాగును ఆశించే మోగి పురుగు,అగ్గి తెగులు, రసం పీల్చే, కాయ తొలుచు పురుగుల నివారణకు చేపట్టే సస్యరక్షణకు క్లోరోఫిల్ ఆర్గానిక్ కంపెనీ ఎరువులు మేలు చేస్తాయని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ మేనేజర్ మహిపాల్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలోని రైతులకు బస్టాండ్ ఆవరణం వద్ద క్లోరోఫిల్ ఆర్గానిక్ ఎరువులు పని చేసే విధానంపై మహిపాల్ రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల నివారించి సేంద్రీయ ఎరువులపై దృష్టిసారించి భూసారాన్ని పెంపోదించుకోవాలని మహిపాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్ఓ శంకర్, ప్రభుదేవా ఫర్టిలైజర్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్ డీలర్ ముక్కీస యాకుబ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ రైతులు హాజరయ్యారు.

విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్

నవతెలంగాణ-చేర్యాల



విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ చేర్యాల డివిజన్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ నిరంతరం ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల పక్షాన గల్లి నుంచి ఢిల్లీ వరకు పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులను సంఘటితం చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యా కాషాయకరణ, విద్యా కార్పోరేట్ కు వ్యతిరేకంగా, ఈవ్ టీజింగ్ ర్యాగింగ్ కు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఉద్యమిస్తుందన్నారు. ఘనమైన చరిత్ర కలిగిన విద్యార్థి సంఘంలో విద్యార్థులు చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం గౌతమి ఒకేషనల్ జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఆకుల శిరీష, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎద్దు కార్తీక్, మండల కన్వీనర్ యాసిన్, తేజ, శ్రావణి, శివాని, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు పంటల రక్షణపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ గ్రామంలో గల రైతు వేదికలో మంగళవారం రోజున రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా నేరుగా రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ జి .శ్రీనివాస్, పరిశోధన స్థానం పొలస వారు అధిక వర్షాలకు వివిధ పంటల్లో (పత్తి, వరి, మొక్కజొన్న, కంది కూరగాయలు) చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల పై అవగాహన కల్పించటం జరిగింది. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శరణ్య, సమత, ఖలీల్, భాను ప్రకాష్, కిరణ్, కృష్ణమూర్తి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.లక్ష సాయం



నవతెలంగాణ-మర్కుక్

ఇటీవల అకాల మృతి చెందిన కేజీబీవీ గణిత ఉపాధ్యాయురాలు గీతాదేవి కుటుంబానికి పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు కూర రఘోత్తం రెడ్డి , పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి , గీతాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్టీయూ ఎల్లవేళ ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆదరాసు పల్లి శశిధర్ శర్మ ,ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి , మర్కుక్ మండల పీఆర్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నారెడ్డి రామకృష్ణారెడ్డి , తుమ్మ కుమార్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసరావు , వెంకటేశ్వర రెడ్డి , రజిత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, సీనియర్ నాయకులు స్వాతి, శ్రీనివాస్ , మోతీ రామ్ ,తదితరులున్నారు.

విద్యార్థులు లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలి

- బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ బీఆర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



విద్యార్థులు పోటీ పరీక్షలకు లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ బీఆర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ లైబ్రరీకి బీఎన్ రావు ఫౌండేషన్ స్టడీ మెటీరియల్, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు విద్యార్థులు సరైన అవగాహన ఏర్పరచుకోవాలని తెలిపారు. లక్ష్యం ఏర్పరచుకొని క్రమశిక్షణతో సిద్ధమైతే ఎలాంటి లక్ష్యమైనా సాధ్యమవుతోందన్నారు. దేశంలో నిరుద్యోగ శాతం ఎక్కువగా ఉండి ప్రభుత్వం, ప్రయివేటు రంగాలలో ఇప్పటికిప్పుడు 11 కోట్ల ఉద్యోగాలు ఖాళీగ ఉన్నాయన్నారు. చదువుకున్న యువతే ఈ దేశానికి మానవ వనరులు అన్నారు. అభివృద్ధి జరిగితే ఉద్యోగ కల్పన కూడా జరుగుతుందన్నారు. ఇది ప్రభుత్వం ప్రాథమిక బాధ్యత అని డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళి, అడ్వకేట్ దినేష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సారధి జిల్లా ఉపాధ్యక్షులుగా కొమ్ము రవీందర్

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా ఉపాధ్యక్షుడిగా కొమ్ము రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సారథి కళాకారుల సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం రావురుకుల గ్రామానికి చెందిన కొమ్ము రవీందర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు . అనంతరం ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు అవకాశం ఇచ్చిన సారథి కళాకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

పార్లమెంటు ఓటర్ జాబితా ప్రామాణికమా..!

- సీఎం 2011 ఓటర్ జాబితా సిద్ధం చేయాలని సీఎస్‌కు ఆదేశం
- బీసీ గణన పై మంత్రి పొన్నం వ్యాఖ్యలు
- రిజర్వేషన్లు మార్చాలని స్థానిక నేతల ఒత్తిడి





నవతెలంగాణ-గజ్వేల్

పార్లమెంట్ ఎన్నికల ఓటర్ జాబితాను ప్రామాణికంగా తీసుకొని ఎన్నికల జరపాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో సిద్దిపేట జిల్లాలో అధికార యంత్రాంగం పూర్తిగా ఎన్నికల ఏర్పాట్లు నిమగ్నమైంది. సెప్టెంబర్ 3వ, 4వ తేదీల్లో ఆయా పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఓటర్ జాబితా సైతం సెప్టెంబర్‌లోని విడుదల చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా వార్డుల రిజర్వేషన్లు, మండల, జిల్లా పరిషత్ రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది. బీసీ గణన పూర్తి అయిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్తామని మరోపక్క రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఇటీవల ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పార్లమెంటు ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకొని బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసే పనిలో ఉండాలని సీఎస్‌కు సూచించగా క్షేత్రస్థాయిలో ఆదేశాలు ఇచ్చారు. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, పాత నియోజకవర్గమైన చేర్యాలలో అధికార యంత్రాంగం పూర్తిగా అన్ని గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి వాతావరణం తీసుకొస్తున్నారు. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకే సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మండల స్థాయి అధికారులు తెలుపుతున్నారు. గత ఫిబ్రవరితో సర్పంచుల పదవి కాలం ముగిసిన విషయం తెలిసిందే.

ఎన్నికల వాతావరణాన్ని అంచన వేస్తున్న కార్యదర్శులు

పంచాయతీ కార్యదర్శులకు పూర్తి బాధ్యత ఇచ్చారు. అదేవిధంగా ఎన్నికలు జరపాలంటే గత ప్రభుత్వం రిజర్వేషన్లు వారికి అనుకూలంగా చేసుకున్నారని ఆరోపణలు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కుల, గణనా చేపట్టి తమ పార్టీకి అనుకూలమైన వ్యక్తులకు పదవులు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుంది. అందుకే కుల, గణన తెరపైకి వచ్చిందని చెప్పాలి.

జిల్లాలో ఇది పరిస్థితి.

సిద్దిపేట జిల్లాలో 26 మండలాలు ఉండగా, 499 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు చేశారు. వీటితో కలిపి 514 ఉన్నాయి. పాత వార్డులు 4,470 ఉండగా కొత్త వార్డులు కలిస్తే 4,566 వరకు చేరుతాయి. పార్లమెంటు ఎన్నికల ఓటర్ జాబితా ప్రామాణికం 2011 ప్రకారం సిద్దిపేట జిల్లాలో 10,12,066 జనాభా ఉన్నారు. గ్రామాల్లో జనాభా 7,95,690 వరకు ఉన్నారు.

నేతల ఆశలు..

ఇందులో భాగాంగానే గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 175 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 150 వరకు అప్పటి అధికార పార్టీ సర్పంచులు ఉండటం వల్ల కుల, గణన నిర్వహిస్తే గ్రామాల్లో తమ నాయకులకు కార్యకర్తలకు సర్పంచ్ పదవులను, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పదవులు కట్టబెట్టుకోవచ్చని భావిస్తున్న తరుణంలో ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేస్తుంది. కుల గణనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరపైకి తీసుకొచ్చి కుల గణన చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గ నాయకులు సంబరపడుతున్నారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తుందని స్థానిక నాయకత్వం భావిస్తుంది. గజ్వేల్ నియోజకవర్గంలో 9 మండలాల్లో 175 సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులను రిజర్వేషన్ల ప్రకారం రంగంలో దించి ఎక్కువ శాతం గెలిచినందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు చేస్తుంది. రిజర్వేషన్లు పై కూడా రాజకీయ ఒత్తిడి ఉండవచ్చని అందరూ భావిస్తున్నారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లు మార్పు చేర్పుల చేయవలసిన అవసరం ఉందని స్థానిక నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని ప్రభుత్వాన్ని కోరుతుంది. గజ్వేల్ నియోజకవర్గంలో 8 మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు అధికార పార్టీకి చెందిన వారు ఉండటంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థాయిలో ఓట్లు సాధించలేకపోయింది. దీంతో రిజర్వేషన్ల మార్పు చేర్పులు కోరుతుంది. సర్పంచుల స్థానాలు కూడా ఎక్కువ శాతం అధికార పార్టీ నాయకులే ఉండటమే కాంగ్రెస్కు ఓట్లు రాలేదని గజ్వేల్ నేతలు భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలని స్థానిక నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అన్ని ప్రాంతాల నుంచి ఈ ఒత్తిడి రావడం వల్ల రిజర్వేషన్లు మార్పు చేయాలంటే కుల గణనా నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. గజ్వేల్ మండలం జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఎస్సీలకు 10ఏళ్ల కేటయించారు. ప్రస్తుతం ఐదేళ్ల పూర్తికాగా మరో ఐదేళ్ల ఇదే రిజర్వేషన్లు కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులు ఇతర సామాజిక వర్గాలు రాజకీయంగా నష్టపోతారని భావిస్తున్నారు.

ప్రస్తుత రిజర్వేషన్లు..

తూప్రాన్, మనోహరాబాద్, జగదేపూర్, వర్గల్, ములుగు, కొండపాక తదితర మండలాల్లో రిజర్వేషన్ల మార్పు కూడా అవసరం ఉంటుందని అక్కడ కూడా బీసీ, ఓసీలు, ఎస్సీల రిజర్వేషన్లు ఉన్నాయి. అంతట మార్పు జరగాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం గట్టిగా కోరుకుంటుంది. గత పదేళ్లుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను నాయకులను కాపాడుకోవాలంటే ఏదైనా ఒక పదవి అప్పగించాలని ఇక్కడి నాయకత్వం భావిస్తుంది. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఇప్పటికీ పదవి యోగం రాలేదని చెప్పాలి. త్వరలో జరగనున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఛాన్స్ కొట్టేయాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ ప్రకారం పదవుల కోసం ఆశ పడుతున్న వారికి స్థానాలు దొరికే అవకాశం లేదు. మార్పులు, చేర్పులు అవుతూనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పై నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్లు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

జిల్లాలో పాగ వెయ్యాలని..

సిద్దిపేట జిల్లాలో అన్ని గ్రామాల్లో మండలాల్లో జిల్లా పరిషత్ స్థానంలో కాంగ్రెస్ పాగ వెయ్యాలనే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల సిద్దిపేట గజ్వేల్ ప్రాంతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యకర్తల్లో ఇరు పార్టీలు హై టెన్షన్ నింపుతున్నాయి.

విద్యారంగ సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు
- పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని రాస్తారోక



నవ తెలంగాణ-సిద్దిపేట

విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణం పాత బస్టాండ్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని రాస్తారోక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు అనేకంగా ఉన్నాయనీ, గత ఆరేళ్లుగా రూ. 8350 కోట్లు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చెయ్యకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. బకాయిలను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. రాష్ట్రంలో మార్పు తీసుకొని వస్తామని 8నెలలు గడుస్తున్నా, విద్య రంగ సమస్యలపై దృష్టి పెట్టకపోవడం సిగ్గుచేటని, స్వయంగా ముఖ్యమంత్రి విద్యాశాఖను చూస్తున్నారని, కానీ దీనిని పట్టించుకోవడంలో సీఎం విఫలం చెందారని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆముదాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్, జిల్లా సహాయకార్యదర్శి గుండె అరుణ్ కుమార్, జిల్లా నాయకులు తాడూరి భరత్ కుమార్, చెప్యాల సంతోష్,విద్యార్థులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులను సరెండర్ చేయాలి..?

- మున్సిపల్ కౌన్సిలర్లు తీర్మానం
- గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు

నవతెలంగాణ-సిద్దిపేట



టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలు పాటించడం లేదని, వారిని సరెండర్ చేయాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్లు తీర్మానం చేసినట్లు తెలిసింది. మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు అధ్యక్షతన పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల కోసం ఏర్పాట్లను పూర్తిచేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణ పరిధిలో గణేష్ మండపాలకు గత రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు, ఈసారి కూడా సిద్దిపేట మున్సిపల్ పరిధిలో అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని కౌన్సిలర్ ఉదర జయ వెంకట్ రెడ్డి కోరగా, సమావేశానికి హాజరైన విద్యుత్ అధికారులకు ఉచిత విద్యుత్ అందించేలా చూడాలని పాలకవర్గం సూచించారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో 31 ఏజెండా అంశాలను పొందుపరచగ వాటిని పాలక మండలి ఆమోదం తెలిపారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రేరణకి పాలకమండలి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు, కమిషనర్ ప్రేరణ, కౌన్సిల్ , కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయం అన్ని విభాగాల అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే చట్టరిత్య కఠిన చర్యలు

- గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. మంగళవారం ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపవద్దని అమూల్యమైన జీవితాన్ని రోడ్డుపాలు చేసుకోవద్దు అన్నారు. ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 42 మందికి రూ.25.5 వేలు జరిమాన విధించమన్నారు. సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో 42 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు వచ్చిందన్నారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక న్యాయమూర్తి ముందు హాజరుపరచమన్నారు. విచారణ చేసి జరిమాన విధించారని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడవదని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటీస్తూ వాహనాలు నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరీ పట్ల హర్షం

- న్యాయ వ్యవస్థ పై నమ్మకాన్ని పెంచిన సుప్రీంకోర్టు
- గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

రాజకీయ ప్రేరేపితమైన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరి చేయడం పట్ల గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థలపై నమ్మకం పెంచే విధంగా బెయిల్ మంజూరు చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ కక్ష సాధించేందుకు ఈడీ, సీబీఐ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల్ని ఉసిగొల్పి ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి వారిని లొంగదీసుకోవాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు. కేసీఆర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలనే కుట్రలోనే కవితను అరెస్ట్ చేశారని, 5నెలల పాటు జైల్లో ఉంచినా కూడా వెరవకుండా న్యాయవ్యవస్థలపై నమ్మకంతో న్యాయ పోరాటం సాగించడం వల్ల మంగళవారం సుప్రీంకోర్టు కవితకు బెయిల్ మంజూరి చేసిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పోరాట పునాదుల మీద పుట్టిన పార్టీ అని ఎన్ని ఇబ్బందులు కుట్రలు ప్రయోగించినా ధైర్యంగా ఎదుర్కొని కొట్లాడే ధైర్యం దమ్ము పార్టీ నాయకులకు ఉన్నాయని తప్పకుండా ప్రజలకిచ్చిన వాగ్దానాలన్ని అమలు చేసే దాకా మడమ తిప్పకుండా పోరాటం కొనసాగిస్తామన్నారు.

రోడ్లకు మరమ్మత్తులు చేపట్టండి

- సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయండి.
- మున్సిపల్ కమిషనర్‌కు ప్రజల విజ్ఞప్తి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులోని అయ్యప్ప నగర్ కాలనీలో గల వీధుల్లో రోడ్లకు మరమ్మతులను వెంటనే చేయాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సభ్యులు కమిషనర్ గోల్కొండ నరసయ్యను కలసి పలు విషయాలు చర్చించారు. మట్టి రోడ్లు ఉన్నచోట సీసీ రోడ్లుకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలన్నారు. అయ్యప్ప నగర్‌తోపాటు మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో ఇదే పరిస్థితి నెలకొన్నదని అన్నిటిపై దృష్టి పెట్టాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండ్ల స్వామి, మోతె వీరారెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప నగర్ వీధుల రోడ్ల మరమ్మతుల కోసం ప్రజాప్రతినిధులకు, అధికారులకు దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఈ వీధులలోని రోడ్లను బాగు చేయడం లేదని సీసీ రోడ్లు వేయడం లేదని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవం ఈ కాలనీలోనే గత ప్రభుత్వంలోని మంత్రి అధికారులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించినారని దానితో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు ప్రజలు నివాసం ఉండని ఓపెన్ ప్లాట్ల సమీపంలోని రోడ్లలో అవసరం లేని చోట సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగినట్లు వారు స్పష్టం చేశారు.ప్రజలు నివాసముంటున్న అయ్యప్ప నగర్ కాలనీలోని వీధులలో సీసీ రోడ్లు వేయకపోవడం శోచనీయమని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సత్య ఫంక్షన్ హాల్ వీధిలోని రహదారులు రాజిరెడ్డి పల్లె రాజీవ్ పార్కు వెళ్లే వీధిలోని రహదారులు పూర్తిగా గుంతలు, బురదగా మారింది అన్నారు. మోరీలపై ఉండే కల్వర్టు కృంగిపోయి ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగే పరిస్థితిలో ఉన్నాయని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. విషయాన్ని పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జంగం రమేష్ గౌడ్, కార్యదర్శులు స్వర్గం రాజేశం, వగ్గు మల్లేశం కోశాధికారి అలివేలి నారాయణరెడ్డి, అసోసియేషన్ నాయకులు జీవన్ రెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

చెరువుల వివరాలు ఇవ్వాలి

- కలెక్టర్‌ను కోరిన కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గంలో గత ఇరువై ఏళ్ల నుంచి అంటే 2004 జనవరి ఒకటి నుంచి ఈ ఏడాది ఆగస్టు 26 వరకు సిద్దిపేట నియోజకవర్గంలో ఎన్ని చెరువులు, కుంటలు ఉండేవి..? ఇప్పుడు అనగా 2024 ఏడాది వరకు ఎన్ని ఉన్నాయి..? అట్టి చెరువుల, కుంటల పూర్తి పేర్లను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరినట్లు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం చక్రధర్ గౌడ్ మాట్లాడుతూ 2004 ఏడాదిలో ఇట్టి చెరువులు, కుంటలు, ఏయే మండలంలో (పేరుతో సహా), ఏయే ఊరిలో (పేరుతో సహా), ఏయే సర్వే నెంబర్‌లో ఎన్ని చెరువులు, కుంటలు ఉండేవి, మరి ఇప్పుడు అనగా 2024 ఏడాదిలో ఎన్ని ఉన్నాయి. పూర్తి వివరాలు దానికి సంబంధించిన ప్రతులు ఇవ్వాలని, ప్రతి ఊరిలో ఉన్న చెరువు, కుంట యొక్క అప్పటి అనగా 2004 ఏడాదిలో ఉన్న విస్తీర్ణం ఎంత.. ? ప్రస్తుత అనగా 2024 ఏడాది విస్తీర్ణం ఎంత..?, 2004 ఏడాదిలో విస్తీర్ణం కలిగిన చెరువులు, కుంటలు, ఒకవేళ ప్రస్తుతం అనగా 2024 ఏడాదిలో విస్తీర్ణం తగ్గి ఉంటె, అవి ఎవరెవరి ఆధీనంలోకి వెళ్లాయి, వారి పూర్తి పేర్లు, చిరునామాతో సహా తెలుపాలని కోరినట్లు తెలిపారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు గురైనచో, అక్కడ ప్రస్తుతం ఏవైనా నివాస గృహాలు నిర్మించారా..? లేక ఏవైనా వాణిజ్య సముదాయాలు నిర్మించారా..? లేక ఏవైనా పంట పొలాలుగా మార్చబడినాయా వివరాలు ఇవ్వాలని, ఆక్రమణలు గురైతే కబ్జా చేసిన వారిపైన ఏమైనా చట్ట పరమైన చర్యలు తీసుకున్నారా..?, అట్టి వివరాలు పూర్తిగా తెలుపాలని కోరినట్లు తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణమైన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు తెలపాలన్నారు. చెరువులు, కుంటల యొక్క మ్యాపులకు సంబందించిన ప్రతులు ఇవ్వలని, ప్రస్తుతం నాటికి ఎన్ని ఉన్నాయో వాటి మ్యాపులు కూడా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

హుస్నాబాద్‌లో హైడ్రా ఏర్పాటు చేయాలి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో వివిధ అక్రమ నిర్మాణాలపై తొలగిస్తున్న తీరును హుస్నాబాద్ ప్రాంతానికి తీసుకురావాలని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కోరారు. మంగళవారు హుస్నాబాద్ బీఎస్పీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ప్రాంతంలో కబ్జాకు గురైన వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీరపరచుకోవడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. మంచి కార్యక్రమాన్ని అన్ని పార్టీలు, సామాజిక ఉద్యమకారులు వివిధ సంఘాలు స్వాగతించవలసిందేనని అన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీలో హైడ్రా ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను బీఎస్పీ పార్టీ పక్షాన కోరినట్లు చెప్పారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 100 ఎకరాల అసైన్డ్ పరంపోగు భూములు కబ్జాకు గురికావడం జరిగిందన్నారు. గతంలో ప్రభుత్వ భూములు కబ్జా కావడంపై అప్పుడున్న ఎమ్మార్వోలకు, ఆర్డీఓలకు కలెక్టర్లకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ ప్రజా ప్రతినిదులు భూ అక్రమణలు, భూ కబ్జాలు చేసినట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో అక్రమ భూములను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు వెలుపుల రాజు, పార్టీ జిల్లా నాయకులు ఎలగందుల శంకర్, నాయకుడు మారేపల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి



- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్

నవతెలంగాణ-రాయపోల్

సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో సైబర్ నేరాల పట్ల అవగాహన, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వాడకం, మహిళల రక్షణ, షీ టీమ్స్ పనితీరు వంటి అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. యువత చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిసకావద్దన్నారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విక్రమ్, పోలీస్ సిబ్బంది రాజ గౌడ్, మహేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో కారుణ్య నియామకం



నవతెలంగాణ-సిద్దిపేట

గతంలో మర్యుక్ ఆపరేటర్ నక్క ప్రభాకర్ మరణించగా, అతని కుమారుడు నక్క రవికి డిపెండెంట్ జాబ్ సిద్దిపేట సర్కిల్ ఆఫీస్‌లో ఎస్ఈ చంద్రమోహన్ చేతుల మీదుగా ఆర్డర్ కాపీ అందించినట్లు టీజీయూఈఈయూ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటం మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ టీ. శ్రీనాథ్, డీఈ లు భాను ప్రకాష్, మహేష్ కుమార్, యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటిపల్లి సధాకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దూలం యాదగిరి గౌడ్, గజ్వేల్ డివిజన్ ఉపాధ్యక్షులు చంద్రం యాదవ్, గజ్వేల్ డివిజన్ సహాయ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి

- సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్ శ్రీరాజ్

నవతెలంగాణ-రాయపోల్



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్ శ్రీ రాజ్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాల సమయపాలన కచ్చితంగా పాటించాలని, పాఠశాలలో విద్యార్థులందరికీ చదవడం, రాయడం చతుర్వేద విధానం వచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు ఇంటి దగ్గర అల్పాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులు ఏ సబ్జెక్టుల వెనుకబడి ఉన్నారో దాని కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎప్పటికప్పుడు బోధనోపకారణాలను అందుబాటులో ఉంచాలని తెలియపరచడం జరిగిందన్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి టేస్ట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అండాలు, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, భాస్కర్, సీఆర్పీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు పోలీస్ పర్మిషన్ తప్పనిసరి

- ఆన్లైన్‌లో అప్లయ్ చేసుకోవాలి
- డీజేలకు అనుమతి లేదు
- గజ్వేల్ ఏసీపీ కే.పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ డివిజన్‌లోని అన్ని మండలాలలో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలని పురుషోత్తం రెడ్డి పోలీసులు స్పష్టం చేశారు. మైలవరం ఆయన గణేష్ మండపాల నిర్వహణపై మాట్లాడారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు వెబ్ సైట్లో అప్లై చేసుకోవాలని సూచించారు. బాక్స్ టైప్ లౌడ్ స్పీకర్లను మాత్రమే వాడాలని, రాత్రి 10 గం.నుంచి ఉదయం6 వరకు వాటిని వినియోగించవద్దని తెలిపారు. పూర్తి వివరాల కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ, ఎస్ఐ వద్ద నుంచి సమాచారం తెలుసుకోవలన్నారు. అంతేకాకుండా పోలీస్ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కరెంట్ కనెక్షన్ కోసం డీడీలు తీయాలని, విద్యుత్ అధికారుల పర్మిషన్ తప్పనిసరన్నారు. మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయొద్దని, కనీసం టూ వీలర్ వెళ్లేందుకైనా దారి ఇవ్వాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 దాటిన తర్వాత మైక్లు ఆఫ్ చేయాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవడం మేలని, ఫైర్ సేఫ్టీ తప్పక పాటించాలన్నారు. వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని మండపాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ముఖ్యంగా శాంతియుత వాతావరణంలో పండుగ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ బి.సైదా, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన ఉపాధ్యాయులకు, సిబ్బందికి మంగళవారం ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ పాఠశాలలో పనిచేసిన ఆదిరాల సాయినాథ్ శర్మ, నరేశ్, ఆఫీసు సిబ్బంది శ్రీలత, రాజ్య లక్ష్మీ, చక్రధర్‌లను ఘనంగా సన్మానించారు. రామస్వామి గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎక్కడ పని చేసిన అంకితభావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందని ఆ విధంగా తీర్చిదిద్ది సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ భాగ్యలక్ష్మీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టుకు కొమ్మూరి పరామర్శ

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల సీనియర్ జర్నలిస్ట్ తుంగ పవన్ కుమార్, డాక్టర్ రఘునందన్ రానాల తండ్రి, విశ్రాంత మండల విద్యాధికారి రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డి, నాయకులు పుర్మ ఆగం రెడ్డి, మెరుగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

30న సిద్దిపేట జిల్లా యోగాసన పోటీలు

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న జిల్లా స్థాయి యోగాసన పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 10 నుంచి 14 ఏళ్ల వారికి (సబ్ జూనియర్) , 14 నుంచి 18 ఏళ్ల వారికి (జూనియర్) , 18 నుంచి 28 ఏళ్ల వారికి (సీనియర్), 28 నుంచి 35 ఏళ్ల వారికి, 35 నుంచి 45 ఏళ్ల, 45 నుంచి 55 ఏళ్ల వారికి మూడు విభాగాల్లో మాస్టర్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. బాల బాలికలకు వేరుగా పోటీలు జరుగుతాయి అని తెలిపారు. ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ యోగాసన (సింగిల్ , పెయిర్), రిథమిక్ యోగాసన (జంట) విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనేవారు వయస్సు ధ్రువీకరణ పత్రము, బోనఫైడ్‌తో పాటు ఫోటోను తీసుకురావాలని సూచించారు. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయి యోగాసనా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే జాతీయ స్థాయి పోటీలకు కూడా వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పోటీలో పాల్గొనే వారు 6302227030 ,9160139889 , 9000190589 ఫోన్ నెంబర్లను సంప్రదించవలెనని సూచించారు. ఈ అవకాశాన్ని యోగ సాధకులు అందరూ సద్వినియోగం చేసుకొని కోరారు.

గురుకుల పాఠశాలలో ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడలో గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (కళాశాల)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ తెలిపాడు. ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 28న బుధవారం స్పాట్ అడ్మిషన్ ఉంటుందని తెలిపాడు. అర్హత గలవారు బుధవారం ఉదయం 9 గంటలకు పాఠశాలలో స్పాట్ అడ్మిషన్ సెంటర్ నందు హాజరు కావాలన్నారు.

మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు పూర్తి

నవతెలంగాణ-తొగుట



మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు పూర్తి చేశామని మండల అధ్యక్షులు పుల్లగుర్ల రామ చంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి లచ్చు గారి కనక రెడ్డిలు అన్నారు. మంగళవారం వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిర్విరామంగా పోరాడేందుకు పీఆర్‌టీయూ టీఎస్ శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు తాటి హనుమారెడ్డి, సోమగారి నాగిరెడ్డి, బక్కన్న గారి మల్లారెడ్డి, ముక్క రమేష్, మండల బాధ్యులు సాయిరి రాంబాబు, బత్తుల సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలతో ఉపాధికి బాటలు

- రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత
- జిల్లాలో 2005 ఎకరాల్లో పండ్ల తోటల సాగు
- మామిడి, జమ, సపోటకు మొగ్గు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

సిద్దిపేట జిల్లాలో అధిక రైతులు పండ్ల తోటలకు ప్రాధాన్యమిస్తున్నారు. పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి పొందవచ్చని భావిస్తున్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న సన్న కారు రైతులకు పలు విధాలుగా సహకరిస్తున్నాయి. పండ్ల తోటలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కింద తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం 16 రకాల పాల తోటలను ఎంపిక చేసింది. ఈ పండ్లతోటలు ఏ రైతులు నాటి సాగు చేస్తారని జాబితా తయారు చేస్తున్నారు. మొక్కలు నాటినప్పటి నుంచి ఫల సాయం అందే వరకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, రైతులకు 100శాతం, రాయితీపై మిగిలిన రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్పు ఇరిగేషన్ పరికరాలను అందజేస్తున్నారు. రెండు రకాలుగా ప్రయోజకరంగా ఉన్నందున సిద్దిపేట జిల్లాలో ఈ ఆర్థిక ఏడాదికి 25 ఎకరాల్లో మామిడి, జామ, సపోటా, నారింజ, డ్రాగన్ ఫ్రూట్ లాంటి పండ్ల తోటలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

16 రకాల పండ్ల తోటలకు అవకాశం.

ప్రస్తుతం జిల్లాలో ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా 16 రకాల పలు తోటలు అవకాశం ఉందని ఉపాధి హామీ అధికారులు అంచనా వేశారు. దానికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేశారు. మామిడి, సపోటా, జీడి మామిడి, జామ, సీతాఫలం, ఆపిల్ బేర్, నారింజ, దానిమ్మ, కొబ్బరి, మునగ, చింత, అల్ల నేరేడు, ఆయిల్ ఫామ్, డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి, లాంటి పండ్ల మొక్కలు నాటేందుకు ఈ పథకం కింద ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎక్కువమంది



రైతులు డ్రాగన్ ఫ్రూట్, మామిడి, సపోటా, నారింజ, సాగు చేస్తున్నారు.

సన్న, చిన్నకారు రైతులఎంపిక చేసే విధానం.

జిల్లాలో చిన్న సన్నకారు రైతులకు మాత్రమే దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. రైతులకు గరిష్టంగా ఐదు ఎకరాలు ఉంటే వారికి అవకాశం కల్పిస్తారు. ఐదు కంటే ఎక్కువ భూమి ఉన్న రైతు ఇందుకు అనర్హుడు. ఉపాధి హామీ జాబుకార్డ్, పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ప్రభుత్వం పేర్కొన్న 16 రకాలే కాకుండా రైతులకు నచ్చిన పలు మొక్కలను ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. రైతులు తమకు నచ్చిన నర్సరీ నుంచి మొక్కలు తీసుకువెళ్లవచ్చు. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర కంటే అధికంగా ఉంటే మొత్తాన్ని రైతుల భరించవలసి వస్తుంది. ఈ 16 రకాలు కాకుండా రైతులకు ఇష్టమైన పండ్ల తోటల మొక్కలను నర్సరీల నుంచి తీసుకువెళ్లొచ్చు. కానీ ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ మాత్రమే వర్తిస్తుంది. అంతకన్నా ఎక్కువ ఖర్చు గల మొక్కలను తీసుకువెళ్లాలనుకుంటే ఆ ఖర్చు మొత్తం రైతే భరించవలసి వస్తుంది.

జిల్లాలో అధిక రైతులు తోటల సాగే లక్ష్యం

జిల్లాలో 23 మండలాల పరిధిలోని 489 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామపంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూముల లో 2005 ఎకరాల్లో పండ్ల తోటల సాగును లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటివరకు 538 మంది రైతులు 1056 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేసేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 479 మంది రైతులకు సంబంధించి 832 ఎకరాలు సాగు చేసేందుకు ప్రభుత్వం మంజూరు లిస్టును పంపించింది. 161 మంది రైతులు 267 ఎకరాల్లో పండ్ల తోటలు నాటారు. మరో 237 మంది రైతులు 432 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధం చేసి ఉంచారు.

సన్న, చిన్నకారు రైతులే అర్హులు



జిల్లాలో సన్న, చిన్న కారు రైతులు మాత్రమే ఈ పండ్ల తోటలకు అర్హులు. ఈ 16 రకాల పండ్ల తోటలు సాగు చేసేందుకు ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల భూమి మాత్రమే ఉండాలి. వారికి జాబ్ కార్డ్, పట్టాదారు పాసుపుస్తకం, ఉంటేనే ఈ అవకాశం ఉంటుంది. ఇప్పటికే అనేక మంది రైతులు ఆసక్తి చూపడంతో తోటలు పెంచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరింత మందికి లబ్ధి చేకూరేలా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పండ్ల తోటలతో తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం వస్తుంది. ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పత్తి, మొక్కజొన్న, తో పాటు పండ్ల తోటలకు ప్రాధాన్యమిస్తే రైతులకు తక్కువ శ్రమ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుంది.

-రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జయదేవ్ ఆర్య

దుబ్బాకకు త్వరితగతిన నిధుల్ని విడుదల చేయాలి

- పల్లెల్లో పాలన గాడి తప్పింది
- రైతులందరికీ బేషరతుగా రుణమాఫీని చేయాలి
- ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక నియోజకవర్గానికి వెంటనే నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన నాటినుంచి పాలన గాడి తప్పి పల్లెలన్నీ అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు. 60 శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగిందని, మిగతా 40 శాతం మంది రైతులకు కూడా బేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'నియోజకవర్గస్థాయి సంక్షేమ హాస్టల్ల సలహా కమిటీ' ప్రత్యేక సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గంలో 9 ఎస్సీ, ఎస్టీ,బీసీ (బాలుర, బాలికల) సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని, విద్యార్థులకు పడుకోవడానికి బెడ్లు సరిగా లేవని, వాటన్నింటిలోనూ సమస్యలు తిష్టవేశాయని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అధికారులు, వార్డెన్ల పని తీరు సరిగా లేదని ఎమ్మెల్యే తీవ్ర ఆసనం వ్యక్తం చేశారు.ఆసంక్షేమ హాస్టళ్లకు రావలసిన కాస్మోటిక్ చార్జీల బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుబ్బాకలో అన్ని గ్రామాల్లో నూ తాగునీరు, పారిశుద్ధ్యం, కరెంటు ,రోడ్లు, ఇతర మౌలిక వసతులు అధ్వాన్నంగా ఉన్నాయని మండిపడ్డారు. దుబ్బాకకి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ తరహాలో ఉవ్వెత్తున ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. అనంతరం పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఆ తర్వాత నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులతో రుణమాఫీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో మెదక్ జిల్లా బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగరాజు గౌడ్, సిద్దిపేట జిల్లా అసిస్టెంట్ బీసీ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు భద్రయ్య, హమీద్, లింగేశ్వర్, చేగుంట హెచ్డబ్ల్యూఓ శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు మల్లయ్య, ఏవోలు, దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ బాల, బాలికల హాస్టల్ల వార్డెన్‌లు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట

డెంగ్యూ, మలేరియా, డయేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి డాక్టర్లను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా ఎమర్జెన్సీ వార్డులో గల డిపార్ట్మెంట్ ఆఫ్ సైకియాట్రిక్- డిఅడిక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఇందులో మత్తు పదార్థాలకు, మద్యపానంకి బానిసైన వారికి కౌన్సిలింగ్, ఇతరత్రా పద్ధతుల ద్వారా ట్రీట్మెంట్ అందిస్తున్నట్లు హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ శాంతి కలెక్టర్‌కు తెలిపారు. వీటికి బానిసైనా వారికి తప్పనిసరిగా నయమయ్యే వరకు ట్రీట్మెంట్ అందించాలని, ఇక్కడ ఒకటి నుంచి రెండు వారాలు ట్రీట్మెంట్ పూర్తయిన తర్వాత కూడా పేషెంట్‌ను తరచు మానిటరింగ్ చేస్తూ ఉండాలని, డి అడిక్షన్ సెంటర్కు వస్తే తప్పనిసరిగా మన జీవితాల్లో మద్యపానం మానేలా మార్పు వస్తుందని అందరికీ తెలిసే విధంగా విధులు నిర్వహించాలని డాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో డెంగ్యూ, మలేరియా కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డులకు వెళ్ళి పేషంట్లతో మాట్లాడారు. ఎవరు అధైర్య పడవద్దని అన్ని రకాల వసతులు ఇక్కడ ఉన్నాయని, జ్వరం వచ్చిన, డెంగ్యూ, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు ప్రభలిన అన్నిటికీ ట్రీట్మెంట్ ఇచ్చేందుకు డాక్టర్ల బృందం సన్నద్ధంగా ఉందని పేషంట్లకు భరోసా ఇచ్చారు. ఈ నెలలో ఇప్పటివరకు డెంగ్యూ 19 కేసులు, మలేరియా డయేరియా కేసులు ఒకటి చొప్పున వచ్చాయని తెలిపారు. జ్వరం వచ్చిన ప్రతి వారికి కూడా డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు రావని, ఎవరూ అధైర్య పడవద్దని, జిల్లాలో ఫీవర్ సర్వేలో వచ్చిన ప్రతి పేషెంట్ ను ఆసుపత్రి కి రాగానే ముందుగా వారి బ్లడ్ శాంపిల్స్ తీసుకొని అన్ని రకాల టెస్టులు చేసి అడ్మిట్ చేసుకోవాలని డాక్టర్లకు సూచించారు. అలా చేయడం వలన పాజిటివ్, నెగిటివ్ అనేది వెంటనే తెలిసిపోతుందని, తద్వారా పేషెంట్ కు ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాలో డాక్టర్ కు కూడా తొందరగా అర్థమవుతుందని అన్నారు. డెంగ్యూ, మలేరియా విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, అయా డిపార్ట్మెంట్ డాక్టర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదు

- అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించాలి
- చేర్యాల ఎస్ఐ పి.నీరేష్



నవతెలంగాణ-చేర్యాల

చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావివ్వకూడదని, అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించాలని ఎస్ఐ పి. నీరేష్ అన్నారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మంగళవారం విద్యార్థిని, విద్యార్థులకు మహిళలకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాల గూర్చి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నీరేష్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని అన్నారు. నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, తెలిసి తెలియని వయసులో ప్రేమ పెళ్లి అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దని తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పెద్దలను, గురువులను గౌరవించాలని సూచించారు. ఇష్టపడి చదివే వారు తప్పకుండా ప్రయోజకులు అవుతారని జీవితంలో స్థిరపడతారని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. క్లాస్ రూమ్‌లలో అందరితో కలిసి ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత క్లాస్ టీచర్కు లేదా హెడ్మాస్టర్ కు తెలియపరచాలని లేదా పోలీసులు, షీ టీమ్స్‌ను సంప్రదించాలని సూచించారు. ఎవరైనా కావాలని అవమానకరంగా మాట్లాడిన వెంటనే డయల్ 100 కు ఫోన్ చేయాలని ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఫోన్ చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్లమ్మ, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్ల స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్ల కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే నిరవధిక సమ్మె చేపడుతాం

- ప్రభుత్వానికి మధ్యాహ్న భోజన కార్మికుల హెచ్చరిక
- సమస్యలు పరిష్కరించాలని ఎంఈఓ కార్యాలయ సిబ్బంది వినతిపత్రం



నవతెలంగాణ-బెజ్జంకి

మంగళసూత్రాలు, మట్టేలు తనఖా పెట్టి కిరాణా దుకాణాల్లో అప్పులు చేసి పాఠశాలల్లో మధ్యాహ్న బోజనం నిర్వహిస్తున్నామని మా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అక్టోబర్ 14 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మీసం లక్ష్మన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయ సిబ్బందికి కార్మికుల యూనియన్ అధ్వర్యంలో తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వినతిపత్రమందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మన్ మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల వలే మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనమందిస్తామన్న అంశాన్ని అమలు చేసి విరమణ సమయంలో రూ.5 లక్షలతో పాటు నెలకు రూ.5 వేలు పేన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఏకరూప దుస్తులతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించలని కోరారు. కొమురవ్వ, జిల్లా కనకవ్వ, రామవ్వ భూలక్ష్మి నిర్మల, వజ్రవ్వ, సర్వవ్వ రాధ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ విషయంలో ఎలాంటి మెసేజ్‌లు, ఫైల్స్ ఓపెన్ చేయవద్దు

- సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలి
- చేర్యాల సీఐ ఎల్.శ్రీను



నవతెలంగాణ-చేర్యాల

రుణమాఫీ విషయంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి అధికారులతో మాట్లాడాలని ఎలాంటి మెసేజ్లు ఫైల్స్ ఓపెన్ చేయవద్దని చేర్యాల సీఐ ఎల్. శ్రీను, తెలిపారు. రైతు రుణమాఫీతో పాటు బ్యాంకు అవసరాల నిమిత్తం బ్యాంకు వద్దకు వచ్చిన రైతులు, ప్రజలు, వ్యాపారస్తులకు మంగళవారం సీఐ, ఎస్ఐలు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఎదో బ్యాంకు పేరిట వాట్సాప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు, పిక్చర్ బ్యాంకు లోగో తో వాట్స్ యాప్‌లో ఏపీ కే ఫైల్స్ పంపిస్తున్నారని తెలిపారు. మనం దీన్ని మనము ఓపెన్ చేస్తే మన వాట్సప్ యాప్ వాళ్ళ కంట్రోల్ కీ వెళ్లి పోతుందన్నారు. అంతే కాకుండా మన కాంటాక్ట్ లో ఉన్న ప్రతి ఒక్కరికి, ప్రతి గ్రూప్‌నకు మెసేజ్ వెళుతుందని దీని ద్వారా సైబర్ నేరస్థులు మన గూగుల్ పే, ఫోన్ పే యూపీఐ ద్వారా డబ్బులు దోచేస్తున్నారని అన్నారు. ట్రెండింగ్‌లో వున్న టాపిక్(ఋణ మాఫీ) ద్వారా ఏపీ కే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారన్నారు. ఏదయినా ఫైల్స్ వస్తే ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చేయరాదని తెలిపారు. మీ వాట్స్ యాప్ పనిచేయకుంటే వెంటనే తిరిగి రిఇన్స్టాల్ చేసి రిపోర్ట్ ఆప్షన్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎవరైనా ఏదయినా నేరానికి గురి అయితే వెంటనే ఏ 1930 కీ కాల్ లేదా డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. సైబర్ క్రైమ్.జీఓవి.ఇన్ మెయిల్ చేయాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ల ద్వారానే సైబర్ నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఘనంగా వాసవి పారాయణం, గౌరీ పూజ





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్యవైశ్య భవనం వద్ద నిర్మిస్తున్న కమలం వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద మంగళవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో, గోపూజ, సామూహిక గౌరీవ్రతం సామూహిక వాసవి పారాయణం, నిర్వహించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో దాదాపు రూ. 5 కోట్ల వ్యయంతో వైశ్య సోదరుల సహకారంతో నిర్మించదలచిన ఆలయ అభివృద్ధి భాగంలో ఈరోజు 32 వేల గౌరమ్మలను మహిళా సభ్యుల సహకారం తో అమ్మవారికి సమర్పించామని ఈ సందర్భంగా వైశ్య సోదర సోదరీమణులకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య పురోహితులు నంద బాలశర్మ మాట్లాడుతూ శ్రావణమాసంలో గౌరీ పూజ నిర్వహిస్తే శుభం కలుగుతుందని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నిర్మాణం ప్రాంగణంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని సామూహిక గౌరీవ్రతం సామూహిక వాసవి పారాయణం నిర్వహించి గోపూజ చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి ఒక ఆర్య వైశ్యునిగా చిరస్మనీయమైన కార్యక్రమం దలచి పట్టు వదలకుండా అద్భుతమైన ఆలయం వైశ్య సంఘ ఫంక్షన్ హాల్ నిర్మించుకోవడం విశేషమైనదని, దైవ నామస్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ లం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు

జాన్‌డీర్ ట్రాక్టర్‌తో రైతులకు మేలు

- సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

జాన్ డీర్ ట్రాక్టర్ రైతులకు వ్యవసాయంలో ఎక్కువ మేలు చేస్తుందని సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాం పల్లి గ్రామంలో జాన్ ఢీర్ 5045డీ, 5050డీ ట్రాక్టర్ నూ డెమోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతనమైన నూతన టెక్నాలజీతో రైతుల కోసం తయారు చేయబడిందని అన్నారు. దీనితో రైతులు పంట పొలంలో కేజీ వెల్ సహాయం లేకుండానే పొలంలో దున్నవచ్చని అన్నారు . జాన్ డీర్ ఇంజన్ వరి కోత హార్వెస్టర్ కు, జెసిబికు ఉపయోగించుకోవచ్చు అని ఇంజన్ ఒక్కటి తీసుకుంటే నాలుగైదు రకాలుగా వీటిని రైతులు ఉపయోగించుకోవచ్చు అని సూచించారు. అదేవిధంగా రైతులకు ఇబ్బంది కలగకుండా పవర్ స్టీరింగ్ తక్కువ డీజిల్ తో ఎక్కువ మైలేజ్ ఇస్తుందని అన్నారు. ట్రాక్టర్ కొనుగోలు చేసేవారు. సిద్దిపేట జాన్ డీర్ షోరూమ్ ను సంప్రదించాలన్నారు . రైతులు నాగరాజు రామ్ రెడ్డి, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

చేగుంట ఎస్సైగా చైతన్య కుమార్ రెడ్డి పదవి బాధ్యతలు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల ఎస్సైగా చైతన్య కుమార్ రెడ్డి మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, వాహనా నికి నెంబర్ ప్లేట్ ఉండాలని ఎస్సై పేర్కొన్నారు. ఇక్కడ ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన బాలరాజ్ గత కొన్ని నెలలుగా పనిచేసిన రామాయంపేట ఎస్సైగా బదిలీపై వెళ్లారు..

హాట్సాఫ్ ఏఎస్ఐ శంకర్ రావు

- రోడ్డుపై భారీ గుంతను పూడ్చిన ఏఎస్ఐ
- హర్షం వ్యక్తం చేసిన వాహనదారులు

నవతెలంగాణ-బెజ్జంకి

పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు చట్టాలకనుగుణంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించే పటిష్టమైన వ్యవస్థ. చట్టాలతో పాటు రోడ్లపై ప్రజల ప్రయాణానికి ఎలాంటి అటంకాలు ఏర్పడకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునే విధంగా ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారు పోలీసులు. అవగాహనతో పాటు రోడ్లపై ప్రమాధకరంగా మారిన గుంతలను సామాజిక దృక్పథ దృష్టితో పూడ్చివేసి ఎలాంటి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుండా భద్రత చర్యలు చేపడుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని గాగిల్లపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై భారీ గుంత ఏర్పడి ప్రయాణికులకు ప్రభాధకరంగా మారింది.గమనించిన ఏఎస్ఐ శంకర్ రావు కానిస్టేబుల్ శ్రీనివాస్ తో కలిసి సిమెంట్, కంకరను వినియోగించి గుంతను పూడ్చారు. సామాజిక మానవతా దృక్పథంతో గుంతను పూడ్చిన ఏఎస్ఐ శంకర్ రావుకు వాహనదారులు 'హాట్సాఫ్'అంటూ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో పూరిగుడిసె దగ్ధం

- తప్పిన ప్రమాదం
- రూ.60 వేల నగదు, బియ్యం బట్టలు దగ్ధం



నవతెలంగాణ-కౌడిపల్లి

విద్యుత్ షాక్‌తో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన కౌడిపల్లి మండలం కంచన్ పల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన ఏర్పుల శాఖయ్య భార్య కూతురుతో పూరిగుడిసెలో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. మంగళవారం పూరిగుడిసెలో షార్ట్ సర్క్యూట్ అయిన సమయంలో ఇంట్లో వాళ్లు వాకిట్లోనే కూర్చోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా పూరిగుడిసెలో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వచ్చి గుడిసె దగ్ధమైంది. రైతు రుణమాఫీ అయిన రూ.60వేల నగదు ఇంట్లోనే పెట్టగా నగదుతో పాటు ఇంట్లో ఉన్న బట్టలు, రెండు క్వింటాళ్ల బియ్యం ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమై రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కవిత బెయిల్ కోసం బీఆర్ఎస్ నాయకుల పాదయాత్ర



నవతెలంగాణ-మర్కుక్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావాలని కోరుతూ ఎర్రవల్లి బీఆర్ఎస్ నాయకులు ఎర్రవల్లి అంబేద్కర్ చౌరస్తా నుంచి వరదరాజ పూర్ వీరాంజనేయ స్వామి గుడి వరకు మంగళవారం ఉదయం పాదయాత్ర చేపట్టారు. అనంతరం వరదరాజస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మెన్ కమ్మరి బాల్ రాజ్, ఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గీసు మల్లేశం, మాజీ వార్డు సభ్యులు గోదా ఆంజనేయులు, తదితరులున్నారు.

రుణమాఫీ సర్వేకు రైతులు సహకరించాలి

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతులకు రెండు లక్షల రుణమాఫీ విజయవంతంగా కొనసాగుతుందని, అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్ నోట్ ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం రుణ మాఫీ కానీ రైతుల వివరాలు సేకరించడానికి వ్యవ సాయ, వ్యవసాయ విస్తరణ అధికారులు లబ్ధి దారుల ఇంటికి వచ్చి సర్వే చేస్తారని, అధికారుల కు రైతులు సహకరించాలని కోరారు. అధికారులు వారు అడిగిన వివరాలు అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ చేపట్టిందని, రైతులకు అర్హతలు ఉన్నా రుణమాఫీ వర్తించలేని వారు రేషన్ కార్డు లేకపోవటం, ఆధార్ కార్డులో తప్పులు, పట్టాదార్ పాస్ పుస్తకంలోని పేరు సరిలేకపోవడం వంటి కారణాలతో వారి రుణమాఫీ కాలేదని, దీంతో ఆయా రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి నుంచి వారి వివరాలను నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రతిపక్షాలు రైతులను ఆందోళనకు గురి చేసే ప్రకటనలు చేయవద్దని, కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియను దేశ చరిత్రలో నిలిచిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కబ్జాలకు గురైన చెరువులపై దృష్టి పెట్టండి

- బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కూడా చెరువుల పునరుద్ధరణకు పూనుకోవాలని, కబ్జాలకు గురైన చెరువులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరువు కుంటలు కబ్జాకు గురి అవుతున్నాయని గతంలోనే తమ పార్టీ చెప్పుకొచ్చిందని గుర్తు చేశారు. ఈ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎఫ్‌టీఎల్, బంపర్ జోన్లను చదును చేసి సగానికి పైగా తగ్గించిన చెరువుల విస్తీర్ణం అయినా చోద్యం చూస్తున్న అధికారులు మున్సిపల్ పాలకవర్గం మమ్ములను ఎవరు సంప్రదించలేదని, ఫిర్యాదు చేయలేదని చేతులు దులుపుకున్నారని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .గజ్వేల్ ప్రాంతంలోనే పెద్ద చెరువు అయినా పాండవుల చెరువు 104 ఎకరాల విస్తీర్ణం కానీ ఇప్పుడు 49 ఎకరాల విస్తీర్ణంలోనే చెరువు ఉన్నదన్నారు. గజ్వేల్ పట్టణంలో పాండవుల చెరువు రైతు పంటలకు జీవనాధారంగా ఉండేది ప్రస్తుతం ఎఫ్‌టీఎల్ బంపర్ జోన్లను మట్టితో చదును చేసి వెంచర్లు ప్లాట్లు చేసినట్లు ఆయన విమర్శించారు. చేపల పెంపకం తో మత్స్యకారులకు ఉపాధి కల్పించిన చెరువు ఇప్పుడు విస్తీర్ణం సగానికి పైగా తగ్గింది అయినా మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు ఏం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఉన్నత అధికారులు, గజ్వేల్ డివిజన్ రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఐల మహేందర్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు నాయిని సందీప్, చెప్యాల వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా తరహా అథారిటీ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి

- టీపీసీసీ నాయకుడు రసూరీ మల్లికార్జున్



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వ చెరువు శిఖం, నాలాలు, ఎఫ్టీఎల్ భూములను అక్రమించి నిర్మించిన నిర్మాణాలను కూల్చివేస్తూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తున్న హైడ్రా తరహా అథారిటీని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని టీపీసీసీ నాయకుడు రాసూరీ మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ భూములను తిరిగి అప్పగిస్తున్నందుకు మల్లికార్జున్ హర్షం వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని ప్రభుత్వ భూములు అక్రమణకు గురయ్యాయని అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి విచారణ జరిపి ప్రభుత్వ భూములను స్వాదీనం చేసుకోవాలని మల్లికార్జున్ సూచించారు.

జాలపల్లిలో పారిశుద్ధ్య పనులు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మంగళవారం గడ్డి మందు, దోమల మందు పిచికారి చేయించి గ్రామపంచాయతీ సిబ్బంది చేత ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏపుగా మొలచిన పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇండ్ల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



నవ తెలంగాణ-కొండపాక

కృష్ణాష్టమి వేడుకలను కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని శాంభవి మోడల్ స్కూల్ పాఠశాలల్లో ప్రిన్సిపల్ మిద్దె రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాల బాలికలు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో సందడి చేశారు. చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందూ మతంలో కృష్ణ జన్మాష్టమికి చాలా ప్రాముఖ్యత ఉంది. విద్యార్థులలో సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు . శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో, అల్లరి చేష్టలతో విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు మహెూత్సవ కార్యశాల

నవతెలంగాణ-మర్కుక్

బీజేపీ సభ్యత్వ నమోదు మహెూత్సవం కార్యశాల కార్యక్రమంలో భాగంగా బీజేపీ మర్కుక్ మండలాద్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, ప్రదానకార్యదర్శి రాజేందర్ సింగ్ అధ్వర్యంలో సమావేశం మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదు మహెూత్సవ కార్యశాల కన్వీనర్‌లుగా రమేష్ గుప్తా, పాలే మహేందర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంత పరంగా పని చేస్తోందని , క్రమం తప్పకుండా సభ్యత్వాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యకర్తలు ఇష్టంతో సభ్యత్వాలు నమోదు చేయించాలని వివరించారు. దేశంలో అత్యధికంగా సభ్యతాలు ఉన్న పార్టీ బీజేపీ అని చెప్పారు. పార్టీ బలపడాలి అంటే సభ్యత్వ నమోదు విజయవంతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సాయిరెడ్డి శంకర్ రెడ్డి, మధు, కొత్వాల్ రాజు, కుంట సత్యం, తదితరులున్నారు.

వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని పురాతన అలయమైన శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో మంగళవారం రోజున శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు మురళీధర చార్యులు తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భవద్గీత, విష్ణు సహస్రనామస్తోత్రం, పఠించారు. 51 రకాల తీపి పదార్థాలను స్వామివారికి నివేదన చేశారు. వేడుకల్లో భాగంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నలుగురికి సీఎంఆర్ చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మిద్దె శంబయ్య, మాజీ ఉపసర్పంచ్ మిద్దె శివకుమార్, మైనార్టీ నాయకులు ఎండి.హాఫిజ్ తదితరులు ఉన్నారు.